

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి శనివారం 29-08-2026 సంపుటి: 02 సంచిక : 119 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Saturday, 29-08-2026 Volume :02 Issue: 119 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani






Contact Number
9059328777


## హిమాలయాల్లో ప్రమాద ఘంటికలు..!

- వేగంగా కరిగిపోతున్న హిమానీనదాలు
- హిమపాతానికి బదులు ఎత్తైన ప్రాంతాల్లో వర్షాలు
- ఐదు నెలల క్రితమే హెచ్చరించిన శాస్త్రీయ నివేదికలు
- 1975 నుంచి 27 మీటర్లు తగ్గిన మంచు మందం
- 200 కోట్ల మంది నీటి భద్రతపై ఆందోళన

నేపాల్‌ను వణికించిన ఆకస్మిక వరదల వెనుక వాతావరణ మార్పుల తీవ్ర ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. హిందూ కుష్--హిమాలయ ప్రాంతంలోని హిమానీనదాలు ఈ సహస్రాబ్ది ప్రారంభం నుంచి మరింత వేగంగా కరిగిపోతుండగా, ఒకప్పుడు మంచు కురిసే 7 వేల మీటర్లకు పైబడిన ఎత్తైన ప్రాంతాల్లో ఇప్పుడు వర్షాలు కురుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. హిమానీనదాల మంచు నష్టం రెట్టింపై, 1975 నుంచి వాటి మందం 27 మీటర్ల వరకు తగ్గిపోయిందని ఐసీఐఎంవోడ్ నివేదికలు వెల్లడించాయి. ఆసియాకు 'జలస్తంభాలు'గా పేరొందిన ఈ పర్వత ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న మార్పులు భవిష్యత్తులో దాదాపు 200 కోట్ల మంది ప్రజల నీటి భద్రత, జీవనాధారాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



02



## చైనాలో భూకంపం

- రిక్టర్ స్కేలుపై 5.1 ని తీవ్రతతో నమోదు
- భూమికి 13 కి.మీ. లోతులో ప్రకంపనలు
- నేపాల్‌లో మరో హెచ్చరిక జారీ
- వరద ప్రవాహం పెరిగే అవకాశం
- రెస్క్యూ టీమ్‌ను వెనక్కిరప్పిస్తున్న అధికారులు

పెషావర్

చైనాలోని సిచువాన్‌లో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో పొరుగున ఉన్న నేపాల్‌కు శుక్రవారం మరో వరద హెచ్చరిక జారీ అయింది. భూకంప ధాటికి చైనా, నేపాల్? సరిహద్దు? ప్రాంతంలో ఉన్న ఆనకట్ట తెగిపోయిందని పోలీసులు భావిస్తున్నారు. అలాగే, ఎగువ నుంచి వస్తున్న

-మిగతా 2 లో



## తీవ్ర నేరాలు తగ్గాయి

- మూడేళ్లలో 7.15 శాతం నేరాల పెరుగుదల
- సమిష్టి కృషితో సైబర్ నేరాలకు చెక్
- రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడిపై ప్రత్యేక నజర్
- ఇకపై యూనిట్ల వారీగా సమీక్షలు
- క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలి
- అర్ధవార్షిక నేర సమీక్షలో డిజిపి సీవీ ఆనంద్ వెల్లడి

హైదరాబాద్,

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నేరాలు పెరిగినప్పటికీ, తీవ్రమైన నేరాలు తగ్గుముఖం పట్టినట్లు డిజిపి సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. డిజిపి కార్యాలయంలో శుక్రవారం నేరాలపై పోలీసు అధికారులతో డిజిపి అర్ధవార్షిక నేర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఐఎ, సీసీటీఎన్ఎస్, టీజీ శాప్, పోక్సో ది క్యాబినెట్, ఈగల్, ఐసీజేఎస్, కొత్త క్రిమినల్ చట్టాల అమలు సమీక్షించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ రాష్ట్రంలో మూడేళ్లలో నేరాలు 7.15 శాతం పెరిగాయన్నారు. 2023-24లో 2,65,377 కేసులు నమోదు కాగా, 2025-26లో వీటి సంఖ్య 2,84,363కు పెరిగిందన్నారు. డ్రగ్స్ కేసులు 46.10 శాతం పెరిగాయని, 2,026 కేసుల నుండి 2,960కు చేరుకున్నాయన్నారు. ఆర్గనైజ్డ్ క్రైమ్ కేసులు సైతం 25 నుంచి 451కి పెరిగాయన్నారు.

-మిగతా 2 లో

# గట్టిగా వాదించాలి

### అంతర్రాష్ట్ర జలవివాదాల్లో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలి

- మహారాష్ట్ర, ఏపీతో ఉన్న జలవివాదాల్లో తెలంగాణ వైఖరిని స్పష్టంగా వినిపించాలి
- తుమ్మిడిహట్టి, సిడబ్ల్యూసి భేటీలో రాజీలేని వాణి వినిపించాలి
- ఇరిగేషన్ అధికారులతో సీఎం రేవంత్రెడ్డి
- జలవివాదాలకు సంబంధించిన వివిధ కేసులపై ఆరా తీసిన ముఖ్యమంత్రి

మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తో కొనసాగుతున్న జలవివాదాల్లో తెలంగాణ హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు ఎలాంటి రాజీ ఉండబోదన్న సంకేతాలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఇచ్చినట్లు తెలుస్తోంది. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, కృష్ణా--గోదావరి జలాల పంపిణీ, పెండింగ్ కేసులు వంటి అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం.. కేంద్ర జల సంఘం, కేఆర్ఎంబీ, న్యాయస్థానాల వేదికలపై తెలంగాణ వైఖరిని స్పష్టంగా, బలంగా వినిపించాలని ఆదేశించినట్లు సమాచారం. వర్షపాతం లోటు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్రానికి దక్కాల్సిన నీటి వాటాల కోసం గట్టిగా వాదించాలని, తాగు-సాగునీటి అవసరాల విషయంలో ఎలాంటి రాజీకి తావులేకుండా వ్యవహరించాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది.



02



## నెతన్యాహుకు ఇరాన్ ఘాటు హెచ్చరిక

- 'నెతన్యాహును నరకానికి పంపిస్తాం" అంటూ సంచలన వ్యాఖ్యలు
- ట్రంప్ కుమారుడిపై హత్యాయత్నం ఆరోపణలను ఖండించిన ఇరాన్
- అమెరికా, ఇజ్రాయెల్‌పై తీవ్ర విమర్శలు
- యుద్ధం ఇక కొత్త విధానంలో ఉంటుందని హెచ్చరిక

02

## పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్

### క్యూఆర్ పరిధిలో అత్యంత పారదర్శకంగా ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా



- 16 నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా
- రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ప్రక్రియ
- పేదలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత రిజిస్ట్రేషన్
- హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,

హైదరాబాద్ మహానగరంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు రాష్ట్ర హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, కులమతాలు, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని స్పష్టం చేశారు. క్యూఆర్ ప్రాంతంలో తొలి విడతగా చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు

-మిగతా 2 లో


## ప్రజాపాలనా? పోలీస్ పాలనా?


- ప్రశ్నిస్తే కేసులు.. నిరసన తెలుపితే అరెస్టులా?
- రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల జులుంపై హరీశ్‌రావు ఆగ్రహం
- ప్రజాపాలన ముసుగులో అరాచక పాలన నడుస్తోందని విమర్శ
- వివిధ ఘటనలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై ధ్వజం

హైదరాబాద్,

'రాష్ట్రంలో ఉన్నది ప్రజాపాలనా? పోలీస్ పాలనా? ఊరూరా పోలీసులు జులుం ప్రదర్శిస్తున్నారు. రేవంత్‌రెడ్డీ.. ఇదేనా మీరు తెచ్చిన మార్పు' అని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీశ్‌రావు ధ్వజమెత్తారు. మొన్న మహబూబాబాద్‌లో ఓ పోలీస్ అధికారి పాలిటెక్నిక్ విద్యార్థి గొంతుపిసికి క్రూరంగా ప్రవర్తించాడని తెలిపారు. నిన్న నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటలో తన కుమార్తెకు జరిగిన అవమానంపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన వ్యక్తిని పోలీసులు బూటుకాళ్లతో తన్ని, మూత్రం తాగించినట్టు ఆరోపణలొచ్చాయని పేర్కొన్నారు. తాజాగా సూర్యాపేటలో సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడని పోలీసులు కేసులు పెట్టి బడ్డీ కొట్టు

-మిగతా 2 లో






## భయం భయంగా నేపాల్

- నేపాల్ వరద మృతుల సంఖ్య 584
- 3700 మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- ఏ క్షణమైనా సరస్సులు తెగిపోయే ప్రమాదం
- పొంగిపొర్లుతున్న రెండు హిమానీ నదీ సరస్సులు
- హెచ్చరించిన చైనా పోలీసులు
- సైన్యం రక్షించిన వారిలో 85 మంది భారతీయులు
- చైనాలో 400 మంది భారతీయులు సురక్షితం: కేంద్రం వెల్లడి

02

### పొంచివున్న మరో ప్రళయం

నేపాల్‌ను ఇప్పటికే అతలాకుతలం చేసిన వరదల విషాదం ఇంకా ముగియకముందే మరో భారీ ప్రమాదం ముంచుకొస్తోంది. నేపాల్--టిబెట్ సరిహద్దు సమీపంలోని రెండు హిమానీనద సరస్సులు ప్రమాదకర స్థాయిలో పొంగిపొర్లుతుండటంతో దిగువ ప్రాంతాల్లో మరోసారి జలప్రళయం సంభవించే భయం నెలకొంది. వరదల్లో ఇప్పటివరకు 584 మంది ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. 3,700 మందికిపైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించినప్పటికీ వందలాది మంది ఇంకా గల్లంతుగానే ఉన్నారు. భారతీయులు సహా యాత్రికులు, పర్యాటకుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతుండగా, ప్రతికూల వాతావరణం సహాయక చర్యలను మరింత క్లిష్టంగా మారుస్తోంది. మరోవైపు వరద ప్రవాహాల్లో కొట్టుకొచ్చిన బంగారం, నగదు కోసం కొందరు దుర్మార్గులు మృతదేహాలనూ వదలకపోవడం ఈ విపత్తు మధ్య మానవత్వాన్ని ప్రశ్నించే ఘటనగా మారింది.

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
www.epaper.netidarshini.com
శనివారం 29 -08-2026

# చైనాలో భూకంపం

మొదటి తరువాయి


భారీ నీటి ప్రవాహం నది నీటిమట్టం పెరిగే ప్రమాదం ఉన్నందున, నేపాల్‌లోని ప్రభావిత ప్రాంతమైన త్రిశూలి ప్రాంతాన్ని మరోసారి ఖాళీ చేయిస్తున్నట్లు నేపాల్ పోలీసులు తెలిపారు. బీజింగ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం సంభవించిన ఈ భూకంపం భూమికి 13 కి.మీ. లోతులో సంభవించినట్లు తెలుస్తోంది. పైనుంచి బురదతో కూడిన నీటి ప్రవాహం వేగంగా వస్తుండటంతో, నేపాల్‌లోని త్రిశూలి పరివాహక ప్రాంతాన్ని అధికారులు తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశించారు. రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొంటున్న సైన్యం, భద్రతా సిబ్బంది, స్థానిక ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని నేపాల్ పోలీసులు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

కాగా, చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లోని లాంగ్‌చాంగ్ నగరాన్ని భూకంపం కుదిపేసిందని చైనా భూకంప నెట్‌వర్క్ సెంటర్ తెలిపినట్లు ఇంచీ నివేదించింది. మరోవైపు, నేపాల్‌లో వరద వల్ల నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని స్థానిక పోలీసులు తెలిపారు. కాబట్టి సహాయక చర్యల్లో పాల్గొన్న వాహనాలను వెనక్కి తిరగివస్తున్నాయని చెప్పారు. నేపాల్‌కు మరో తీవ్రమైన వరద ముప్పు పొంచి ఉందని అన్నారు. పైనుంచి వస్తున్న భారీ నీటి ప్రవాహం వల్ల నేపాల్‌లోని త్రిశూలి ప్రాంతంలో ప్రజలను మరోసారి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. అలాగే, నేపాల్–చైనా సరిహద్దు సమీపంలో భోటే కోషి నది దిగువన ఉన్న ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని నేపాల్ జలవిజ్ఞాన, వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ సరస్సులో సుమారు 20 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని, రానున్న మూడు రోజుల్లో మరో 30 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు అందులోకి చేరే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఆనకట్ట తెగిపోయే ప్రమాదం ఉందని చైనా అధికారులు నేపాల్‌కు తెలియజేశారు. ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ చర్యల్లో పాల్గొన్న భద్రతా దళాలు మరోవైపు, భౌగోళిక సవాళ్లు ఉన్నప్పటికీ నేపాల్? సైన్యం సహాయక చర్యలను కొనసాగిస్తోందని ప్రతిపక్ష నాయకుడు భీష్మ రాజ్ పేర్కొన్నారు. త్రిశూలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "సైన్యం, హెలికాప్టర్? బృందం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి. ఈ ఆపరేషన్‌లో రెండు సైనిక హెలికాప్టర్ల?తో పాటు, ఇతర ప్రైవేటు రంగానికి చెందిన మరికొన్నింటిని రంగంలోకి దించారు. అందుబాటులో ఉన్న ప్రతి వనరునూ వినియోగించుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న ఓ అధికారి మీడియాతో మాట్లాడారు. తాము కార్మండు నుంచి వచ్చామని, ప్రస్తుత పరిస్థితిని విశ్లేషిస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రభుత్వం, నేపాల్? ప్రభుత్వం రెండూ కలిసి శిథిలాలను తొలగించే పనిలో నిమగ్నమై ఉందని పేర్కొన్నారు.

## హిమాలయాల్లో ప్రమాద ఘంటికలు..!

**వేగంగా కరిగిపోతున్న హిమానీనదాలు**
**హిమపాతానికి బదులు ఎత్తైన ప్రాంతాల్లో వర్షాలు**
**ఐదు నెలల క్రితమే హెచ్చరించిన శాస్త్రీయ నివేదికలు**
**1975 నుంచి 27 మీటర్లు తగ్గిన మంచు మందం**
**200 కోట్ల మంది నీటి భద్రతపై ఆందోళన**

**న్యూఢిల్లీ,**



ఈ సహస్రాబ్ది ప్రారంభం నుంచి హిందూ కుష్ హిమాలయ(హెచ్‌కేహెచ్) అంతటా విస్తరించి ఉన్న హిమానీనదాలు మరింత వేగంగా కరిగిపోతున్నాయని, మంచు నష్టం పరిమాణం రెట్టింపు అయ్యిందని హెచ్‌కేహెచ్ ప్రజల తరఫున పనిచేస్తున్న ఒక అంతర్ ప్రభుత్వ విజ్ఞాన, అధ్యయన కేంద్రం ఐదు నెలల క్రితం వెలువరించిన రెండు నివేదికలు వెల్లడించాయి. 1975 నుంచి హిమానీ నదాల మంచు మందం 27 మీటర్ల వరకు తగ్గిపోయిందని ఈ నివేదికలు పేర్కొన్నాయి. కాఠ్మాండు కేంద్రంగా పనిచేసే ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్(ఐసీఐఎంవోడీ) ఈ నివేదికలను విడుదల చేసింది.ఆసియా జలస్తంభాలు అని పిలిచే ప్రాంతాల్లో నీటిపై ఆధారపడి జీవిస్తున్న దిగువ ఉన్న దాదాపు 200 కోట్ల మంది ప్రజలకు భవిష్యత్తులో ఒక ఆందోళనకరమైన పరిస్థితి ఎదురవుతుందని ఆ నివేదికలు హెచ్చరించాయి. రెండు రోజుల క్రితం వందల మంది ప్రాణాలను బలిగొన్న నేపాల్ ఆకస్మిక వరదలకు అసలు కారణం ఏమిటనే దానిపై శాస్త్రవేత్తలు, పరిశోధకులు దర్యాప్తు చేస్తుండగా వారిలో చాలామంది అనేక అంశాల కలయికే దీనికి కారణమని భావిస్తున్నారు. అయితే అందులో అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే 7వేల మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో మంచు కురవడానికి బదులుగా వర్షం కురవడం. ఒకప్పుడు హిమపాతం నమోదైన ఎత్తైన ప్రాంతాలలో ఇప్పుడు వర్షాలు కురుస్తున్నాయని, అలాగే హిమానీనదాలు చాలా వేగంగా కరిగిపోతున్నాయని, దీనికి కారణం వాతావరణం వేడెక్కడమేనని శాస్త్రవేత్త ఒకరు తెలిపారు.

## నెతన్యాహుకు ఇరాన్ ఘాటు హెచ్చరిక



**-"నెతన్యాహును నరకానికి పంపిస్తాం" అంటూ సంచలన వ్యాఖ్యలు**
**-ట్రంప్ కుమారుడిపై హత్యాయత్నం ఆరోపణలను ఖండించిన ఇరాన్**
**-అమెరికా, ఇజ్రాయెల్‌పై తీవ్ర విమర్శలు**
**-యుద్ధం ఇక కొత్త విధానంలో ఉంటుందని హెచ్చరిక**

**న్యూఢిల్లీ,**

ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం మళ్లీ తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఇరాన్ ఘాటు హెచ్చరిక జారీ చేసింది. తాము నెతన్యాహును నరకానికి పంపుతాం అని హెచ్చరించింది. ఇదే సమయంలో ఇకపై తమ యుద్ధం కొత్త విధానంలో ఉంటుందని ఇరాన్ తెలిపింది.తమ నౌకా మార్గాన్ని బ్లాక్ చేసిన అమెరికాకు కూడా ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రెటరీ మేజర్ జనరల్ మోషెన్ రెజాయే తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్, అమెరికాలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమారుడు బ్యారొన్ ట్రంప్‌ను హత్య చేసేందుకు ప్రయత్నించారు అంటూ నేరుగా ట్రంప్ చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. తాము అలాంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. ఇదంతా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇచ్చిన తప్పుడు సమాచారం అన్నారు. అయితే, తాము నెతన్యాహును నరకానికి పంపుతాం అని హెచ్చరించారు. నెతన్యాహు తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలు జియోనిస్ట్ పాలనకు ముగింపు పలకబోతుందనే విషయాన్ని తాము నిరూపిస్తామని వివరించారు. ట్రంప్ కుమారుడిని చంపాలనుకుంటున్నట్లు నెతన్యాహు తప్పుడు సమాచారం ఇవ్వడం ద్వారా ట్రంప్‌ను ఆందోళనకు గురయ్యేలా చేశారని, దీంతో ట్రంప్ ఒక ఫుడ్ ట్రక్ వర్కర్‌లాగా మారాల్సి వచ్చిందిన మోషెన్ వ్యాఖ్యానించారు.

## ప్రజాపాలనా? పోలీస్ పాలనా?

మొదటి తరువాయి

తొలగించారని, నిరసన తెలిపిన వారిపై కోదాడ సీఐ దౌర్జన్యం చేశాడని ఎక్స్ వేదికగా వివరించారు.ప్రజాపాలన ముసుగులో రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తున్నదని ధ్వజమెత్తారు. సూర్యాపేటలో పోలీసుల దౌర్జన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాసమస్యలపై ప్రశ్నించిన ప్రతిపక్షాలు, రైతులు, విద్యార్థులపై పోలీసులతో జులుం చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నిస్తే కేసులు, నిరసన తెలిపిన వారి అరెస్టులు, హక్కులు అడిగిన వారిపై దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మీరు చెప్పుకొంటున్న ఇందిరమ్మ పాలన? ఇదేనా అని నిలదీశారు. ఇప్పటికైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చొరవ తీసుకోవాలని డీజీపీని డిమాండ్ చేశారు

# భయం భయంగా నేపాల్...

**-పొంచివున్న మరో ప్రళయం**
**--నేపాల్ వరద మృతుల సంఖ్య 584**
**-3700 మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు**
**-ఏ క్షణమైనా సరస్సులు తెగిపోయే ప్రమాదం**
**-పొంగిపొర్లుతున్న రెండు హిమానీ నదీ సరస్సులు**
**-హెచ్చరించిన చైనా పోలీసులు**
**-సైన్యం రక్షించిన వారిలో 85 మంది భారతీయులు**
**-చైనాలో 400 మంది భారతీయులు సురక్షితం: కేంద్రం వెల్లడి**




ఖాట్మండ్:
నేపాల్ ఇంకా భయం గుప్పిట్లోనే ఉంది. ఇప్పటికే వరద విధ్వంసంతో చిగురుటాకులా వణికిన నేపాల్ మరో ముప్పును ఎదుర్కోబోతోంది. నేపాల్–టిబెట్ సరిహద్దుల సమీపంలోని గాలింగ్ సరిహద్దు ప్రాంతం ఎగువన హిమానీనదం కరిగిపోవడంతో ఏర్పడిన సమాజ సరస్సులు రెండు ఇప్పుడు పొంగిపొర్లుతున్నాయి. నదిస్సు నుండి నీరు గట్టును దాటి బయటకు వస్తున్నట్లు చైనీస్ మీడియా శుక్రవారం వెల్లడించింది. సరస్సు నుంచి భారీగా నీరు బయటకు వస్తుండటంతో దిగువ ప్రాంతాల్లోని నదుల్లో నీటి మట్టం పెరుగుతోంది. నదీ పరివాహక ప్రాంతాలకు భారీ వరద ముప్పు ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవి తెగిపోతే మరోసారి భారీ వరదలు సంభవించే ప్రమాదం ఉందని నిపుణులు తెలిపారు. ఈ ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని శుక్రవారం చైనా ప్రభుత్వం కొంతసేపు సహాయక చర్యలను నిలిపివేసింది. అనంతరం డ్రోన్లు, శాటిలైట్లు, శాటిలైట్ ఛాయాచిత్రాల ద్వారా పరిస్థితిని పరిశీలించిన తర్వాత ప్రమాద స్థాయి కొంత తగ్గిందన అంచనా వేసి మళ్లీ సహాయక చర్యలను ప్రారంభించింది. అయినప్పటికీ ప్రాంతంలో భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం కొనసాగుతుండటంతో సహాయక బృందాలు అత్యంత అప్రమత్తంగా పనిచేస్తున్నాయి. ఇప్పటివరకు నేపాల్‌లో 584 మంది మృతి చెందినట్లు అధికారులు ధృవీకరించారు. చైనా వైపున మరో ఐదుగురు మృతి చెందడంతో మొత్తం మృతుల సంఖ్య 552కు చేరింది. ఈ వరదల్లో నేపాల్ పర్యాటక బోర్డు సహాయంతో 117 మంది పర్యాటకులను సురక్షితంగా రక్షించగా, వీరిలో 85 మంది భారతీయులు ఉండగా.. చైనా, దక్షిణ కొరియా, అమెరికా, ఇటలీ తదితర దేశాలకు చెందిన పర్యాటకులు కూడా ఉన్నారు. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, చైనా వైపున చిక్కుకుపోయిన 98 మంది భారతీయులు కూడా సురక్షితంగా నేపాల్‌కు చేరుకున్నారు. వందలాది మంది భారతీయులు సహా మొత్తం 1,400 మందికి పైగా ఇప్పటికీ గల్లంతైనట్లు సమాచారం. భారత ప్రభుత్వ అంచనా ప్రకారం కనీసం 320 మంది భారతీయుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది. గల్లంతైన వారిలో పర్యాటకులు, కైలాస్ మానస సరోవర్ యాత్రికులు, స్థానికులు, సహాయ సిబ్బంది ఉన్నారు. రెడ్ క్రాస్ అంచనా ప్రకారం ఈ విపత్తు వల్ల 90 వేల మందికిపైగా ప్రజలు ప్రభావితమ య్యారు. ఇప్పటివరకు 3,700 మందికి పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రతికూల వాతావరణం కారణంగా సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇంకా 320 మంది భారతీయుల ఆచూకీ గల్లంతు ఖాట్మండ్‌లోని వరద ప్రభావిత ప్రాంతం నుండి 21 మంది భారతీయులు నిన్న సురక్షితంగా చేరుకున్నారని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

త్రిశూలి జల విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న మరో 63 మంది భారతీయులను గురువారం రక్షించారు. చైనా వైపు చిక్కుకుపోయిన మరో 98 మంది భారతీయులు సురక్షితంగా భూమార్గం ద్వారా నేపాల్‌లోకి ప్రవేశించాలని తెలిపినట్లు రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఇంకా దాదాపు 320 మంది భారతీయులు, 100 మంది భారతీయ మూలాలున్న వ్యక్తుల ఆచూకీ కనుగొనలేకపోతున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల నుండి తరలించిన భారతీయ పర్యాటకులను నేపాల్‌లో భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ శుక్రవారం కలుసుకున్నారు.

కొట్టుకొచ్చిన బంగారం, వెండి కప్‌బోర్డ్
అనేక ప్రాంతాల్లో జనాలు సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డారు. ఇలాంటి విపత్తు సమయంలో విపరీతమైన ఆస్తి నష్టం, ప్రాణనష్టం వాటిల్లింది. పలు ప్రాంతాల్లో డబ్బుతో పాటు బంగారం నీటి ప్రవాహంలో కొట్టుకువచ్చాయి. వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన ఓ మహిళ మృతదేహం నుంచి కొందరు ఆభరణాలను దొంగిలించిన దారుణ ఘటన వెలుగు చూసింది. నారాయణి నది ఒడ్డుకు కొట్టుకొచ్చిన ఓ మృతదేహం నుండి కొందరు దొంగలు బంగారు నగలను దొంగిలించారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. దీనిపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఈ ఘటనకు బాధ్యులైన ఇద్దరు వ్యక్తులను నేపాల్ పోలీసులు వెంటనే అరెస్టు చేశారు. మరోవైపు త్రిశూలి నది వరద ఉధృతికి బంగారు, వెండి ఆభరణాలు ఉన్న కప్‌బోర్డు ఒకటి కొట్టుకొచ్చింది. స్థానికులు దానిని తెరిచి చూడగా.. అందులో పెద్ద మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు కనిపించింది. 'జై శ్రీ మహాలక్ష్మి గోల్డ్ అండ్ సిల్వర్ షాప్' అని రాసి ఉన్న బిల్లు కూడా ఇదే అల్మారాలో లభించింది.

# తీవ్ర నేరాలు తగ్గాయి

మొదటి తరువాయి

ట్రాఫిక్ నేరాల్లో 9.48 శాతం పెరుగుదల నమోదైందని, అయితే సైబర్ క్రైమ్ రేటు 13.29కి, ఆర్థిక నేరాలు 13.28కి, తీవ్ర నేరాలు 10.33కి తగ్గాయన్నారు. హైదరాబాద్ నగరంలో తీవ్రమైన నేరాలు 26.23 శాతం తగ్గుముఖం పట్టగా డ్రగ్స్ కేసులు మాత్రం 90.98 శాతం మేరకు పెరిగాయని చెప్పారు.

7.15 శాతం పెరిగిన నేరాలు
రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15 శాతం పెరిగిందని డిజిపి వివరించారు. 2023-24లో 2,65,377 కేసులు నమోదు కాగా.. 2025-26లో 2,84,363కు చేరాయన్నారు. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కి పెరిగిందని, ముఖ్యంగా మాదక ద్రవ్యాల కేసులు 2023-24లో 2,026 ఉండగా.. 2025-26లో 2,960కు చేరాయని తెలిపారు. రాష్ట్ర పోలీసులు ఇకపై నెలవారీ క్రైమ్ రివ్యూలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అయితే క్రైమ్ రివ్యూలు కేవలం గణాంకాలకే పరిమితం కాకూడదని డిజిపి పేర్కొన్నారు. నేరాల కారణాలు, పని విధానం, దర్యాప్తు నాణ్యత, కేసుల పరిష్కారంపై విశ్లేషణ చేయాలన్నారు. ఫీల్డ్ లెవల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో గుర్తించిన సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

సైబర్, ఆర్థిక నేరాల్లో ఊరట
సైబర్ నేరాలు 2024-25తో పోలిస్తే 2025-26లో 13.29 శాతం తగ్గాయని, ఆర్థిక నేరాల్లోనూ 13.28 శాతం తగ్గుదల నమోదైందని డిజిపి తెలిపారు. ఈ రెండు విభాగాల్లో మూడేళ్ల కాలానికి తగ్గుదల కనిపించడం సానుకూల పరిణామంగా పోలీస్ శాఖ భావిస్తోందన్నారు. సమీక్షలో డిజి మహేష్‌భగవత్, సీఐడీ డైరెక్టర్ షికా గోయెల్, ఉమెన్స్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ వారు స్నిగ్ధా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గట్టిగా వాదించాలి

**-అంతర్రాష్ట్ర జలవివాదాల్లో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలి**
**-మహారాష్ట్ర, ఏపీతో ఉన్న జలవివాదాల్లో తెలంగాణ వైఖరిని స్పష్టంగా వినిపించాలి**
**-తుమ్మిడిహట్టి, సిడబ్ల్యూసి భేటీలో రాజీలేని వాణి వినిపించాలి**
**- ఇరిగేషన్ అధికారులతో సీఎం రేవంత్రెడ్డి**
**- జలవివాదాలకు సంబంధించిన వివిధ కేసులపైద ఆరా తీసిన ముఖ్యమంత్రి**

హైదరాబాద్
రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా అంతర్రాష్ట్ర జల వివాదాలపై గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేసినట్లుగా తెలిసింది. సెప్టెంబర్ 01వ తేదీన తుమ్మిడిహట్టిపై ఢిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబర్ 7వ తేదీన సిడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశం ఎజెండాల గురించి అధికారులతో సీఎం రేవంత్రెడ్డి చర్చించినట్లుగా సమాచారం. ఎంసిఆర్హెచ్ఆర్డీలో నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్రెడ్డి అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహారాష్ట్ర, ఏపీతో ఉన్న జల వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టంగా వినిపించాలని సీఎం రేవంత్రెడ్డి ఈ సందర్భంగా అధికారులకు సూచించినట్లుగా సమాచారం. దీంతోపాటు సుప్రీంకోర్టు, కేంద్ర జలవనరుల సంఘం, కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసుల గురించి ముఖ్యమంత్రి ఆరా తీసినట్టుగా తెలిసింది. ఆ కేసులు ఏ దశలో ఉన్నాయి, ఇతర రాష్ట్రాల వాదనలు ఎలా ఉన్నాయి, తెలంగాణ ప్రయోజనాలపై ఎలాంటి చర్యలు చేపట్టాలన్న అంశాలపై సీఎం ఆరా తీసినట్లుగా సమాచారం. దీంతోపాటు సెప్టెంబర్ 04వ తేదీన జరిగే కెఆర్ఎంబీ తదుపరి సమావేశంలోనూ రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా తమ వాదనలు వినిపించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. ఎల్నినో ప్రభావంతో ఏర్పడిన వర్షపాతం లోటును దృష్టిలో ఉంచుకొని తాగు, సాగునీటి విషయంలో రాజీ పడొద్దని మనకు దక్కాల్సిన నీటి వాట్లిలను మనం రాబట్టుకునేలా వాదనలు ఉండాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేసినట్లుగా తెలిసింది. మహారాష్ట్రతో తుమ్మిడిహట్టి అంతర్రాష్ట్ర సమస్యకు పరిష్కారం చూపే దిశగా సెప్టెంబర్ 07వ తేదీన సీడబ్ల్యూసీ నేతృత్వంలో ఏపి తెలంగాణ జలా వివాదాలపై కీలక భేటీ జరగనుంది. కృష్ణా జలాల వాటి, నీటి విడుదలపై ఏపి తెలంగాణ మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణ, నీటి పంపకాలపై కెఆర్ఎంబి పరిధిలో పెండింగ్ అంశాలపై సీఎం అధికారులతో చర్చించినట్లుగా తెలిసింది. దీంతోపాటు గోదావరి జలాల వినియోగం, ప్రాజెక్టుల అనుమతులకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య ఉన్న వివాదాలపై చర్చించినట్లుగా సమాచారం.

# పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్

మొదటి తరువాయి

అత్యంత పారదర్శకంగా లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. మీడియా, అర్హులైన లబ్ధిదారుల సమక్షంలో లక్కీడ్రా నిర్వహిస్తూ, మొత్తం ప్రక్రియను అన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కోసం లక్కీడ్రా నిర్వహించారు. నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్‌లో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కేటాయింపునకు వెట్ గార్డెన్స్‌లో, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి పరిధికి సంబంధించి లక్కీగూడలో నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని డ్రా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిన్నటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున లక్కీడ్రా ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని మంత్రి వివరించారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన నిర్వహిస్తారని, ఎంపికైన వారిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ విధానం ద్వారా అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గుర్తు చేశారు. అనంతరం రికార్డు సమయంలోనే 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి టెండర్లు పిలవడం, మరోవైపు లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి గొప్ప విజయమని అన్నారు. క్యూఆర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు.

# గంజాయి ముఠా దందాకు నల్లగొండ పోలీసులు చెక్

**-గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్**
**2.5 కిలోల గంజాయి స్వాధీనం**
**-రూ.25 వేల నగదు, ఐదు ఫోన్లు పట్టివేత**
**-మరో నిందితుడు ఏ-6 పరారీలో**
**డీఎస్పీ పర్యవేక్షణలో పోలీసుల ప్రత్యేక నిఘా**

**నల్లగొండ, ఆగస్టు 28 (నేటి దర్శిని):** నల్లగొండ పట్టణంలో గంజాయి విక్రయిస్తూ మత్తు పదార్థాల దందాకు పాల్పడుతున్న ముఠా గుట్టును నల్లగొండ టూ టౌన్ పోలీసులు రట్టు చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలో కొంతకాలంగా గంజాయి అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో టూ టౌన్ పోలీసులు అనుమానితుల కదలికలపై నిఘా పెట్టారు. సమాచారం ఆధారంగా దాడులు నిర్వహించి





గంజాయి విక్రయిస్తున్న ఏ-1 నుంచి ఏ-5 వరకు ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2.5 కిలోల గంజాయి, రూ.25 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గంజాయిని కొనుగోలు చేసి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. గంజాయి సరఫరా, విక్రయాలకు సంబంధించి మరిన్ని వివరాలను సేకరించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఏ-6గా ఉన్న మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అతని కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై నల్లగొండ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు గంజాయి విక్రయాలు, సరఫరా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో, నల్లగొండ టూ టౌన్ సీఐ కె. ఆది రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. ఎస్సై సైదా బాబుతో పాటు పోలీసు సిబ్బంది దాడుల్లో పాల్గొని నిందితులను పట్టుకున్నారు. నిందితులపై సంబంధిత క్రైమ్ కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పట్టణంలో గంజాయి దందాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసుల నిఘాను మరింత పెంచనున్నట్లు అధికారులు తెలిపారు. గంజాయి విక్రయాలు లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

# అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్

**రాష్ట్ర ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి**




**మిడ్జిల్,ఆగస్టు28, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :** అన్న వస్తున్నాడంటే సంబురం.. చెల్లి అడుగు పెడితే వేడుక.. చేతినిండా రాఖీలు, నోటినిండా మిఠాయిలు, గుండెనిండా అనురాగం.. దోసిళ్లనిండా కానుకలు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకుని దూర ప్రాంతాల్లో ఉన్న సోదరీ మణులు సైతం తమ సోదరుల వద్దకు చేరుకుని రాఖీల కట్టేందుకు తరలివ చ్చారు.రాఖీ పండుగ అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమాను బంధాలకు ప్రతీకగా నిలు స్తోంది. శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోదరీమణు లు తమ సోదరుల నుదుట తిలకం దిద్ది, చేతికి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి అన్నకిరాఖీ కట్టిన చెల్లమ్మలు మిఠాయి తినిపించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రక్షాబంధన్ అంటేనే అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఆప్యాయ తకు ప్రతిరూపమని తెలిపారు.

# రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీ శంకరాశ్రమంలో రుద్ర మహా చండీయాగం

**-సోదర సౌభ్రాతృత్వమే శ్రీరామరక్ష -**
**-ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర నందగిరి మహారాజ్**





**నల్లగొండ, ఆగస్టు 28 (నేటి దర్శిని):** రాఖీ పౌర్ణమి సందర్భంగా నల్లగొండ జిల్లా పాతబస్తీ హనుమాన్‌నగర్‌లోని హిందూపూర్ కాలనీలో ఉన్న శ్రీ శంకరాశ్రమంలో రుద్ర మహా చండీయాగాన్ని ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర నందగిరి మహారాజ్ (నాగసాధు పరంపర) ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణామూర్తి స్వామి, అగ్ని కాలభైరవ స్వాములకు పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశ్రమానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర నందగిరి మహారాజ్ మాట్లాడుతూ రక్షాబంధన్ అనేది అనాదిగా వస్తున్న అత్యంత పవిత్రమైన సంప్రదాయమని అన్నారు. తల్లిదండ్రుల బంధం, తోబుట్టువుల అనుబంధం, గురు-శిష్య బంధాలకు రక్షాబంధన్ ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉందన్నారు. సోదర సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుకోవడంతో పాటు సత్యం, అహింస, హిందూ సనాతన ధర్మాన్ని ఆచరించడం ద్వారా సమాజంలో మంచి విలువలను పెంపొందించవచ్చని తెలిపారు. మనిషిలోని చెడు గుణాలు, దుర్వ్యసనాలను దూరం చేసుకుని సద్గుణాలతో జీవించాలని సూచించారు. అనంతరం ఆశ్రమానికి విచ్చేసిన సోదర, సోదరీమణులకు ఆశ్రమ పీఠాధిపతి రక్షా రాఖీలను కట్టించి ఆశీర్వదించారు. ఆడపడుచుల చేత భక్తులకు రక్షాబంధన్ కంకణాలు కట్టించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ట్రస్ట్ చైర్మన్ పెరిక ఉమామహేశ్వర్‌తో పాటు నవీన్, యాదయ్య, కృష్ణ, తిరుమలేష్, కిరణ్, వెంకన్న, శ్రీనివాస్, దీపక్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి నివాసంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు




**మిడ్జిల్, ఆగస్టు 28, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి నివాసంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముచ్చర్ల జనార్దన్ రెడ్డి తోబుట్టువులు ఆయనకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ముచ్చర్ల జనార్దన్ రెడ్డి సంతోషంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధాలకు ప్రతీక అని, తోబుట్టువుల మధ్య అనురాగం, ఆప్యాయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు మంత్రికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆమనగల్లు లో ఘనంగా 40వ నూలు పూర్ణిమ గాయత్రీ యజ్ఞోపవీత ధారణ



**ఆమనగల్లు, ఆగస్టు28(నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని భక్త మార్కండేయ దేవస్థానంలో శుక్రవారం 40వ నూలు పూర్ణిమ గాయత్రీ యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివ భక్త మార్కండేయ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు,వేద పండితులు విజ్ఞే శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గాయత్రీ యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని చేపట్టారు.అనంతరం ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ గాయత్రీ యజ్ఞోపవీత ధారణ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్‌ను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో గాజుల సత్యరాములు, అప్పం శ్రీను, ఎంగలి శ్రీధర్,దోర్నాల ఈశ్వరయ్య, వాసు, తిరుపతయ్య,యాదగిరి, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాసులు, గుర్రం సురేష్, సుధీర్,రవీందర్,శ్రీధర్, గుద్దేటి మహేష్, దినేష్, రవి, అవ్వారి శివలింగం, బావుండ్ల నరసింహ, బోడ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మిడ్జిల్‌లో ఘనంగా నూలు పౌర్ణమి వేడుకలు

**- మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు**



**మిడ్జిల్, ఆగస్టు 28, (నేటి దర్శిని ):** మిడ్జిల్ మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూలు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు గంజి శేఖర్ ఆధ్వర్యంలో మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా పద్మశాలి సంఘం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మార్కండేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ.. పద్మశాలి సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. సభ్యులంతా ఐకమత్యంతో ముందుకు సాగుతూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని అన్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షిస్తూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు సభ్యుల సహకారం, భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మ్యాకల శ్రీనివాసులు, గంజి కృష్ణ, బి బాల్ నారాయణ, వెంకటేష్, మారేపల్లి చంద్రశేఖర్, శ్రీనివాస్, చెరుకు శ్రీనివాస్, నారాయణ, శ్రీకాంత్, జంగయ్య, ఆంజనేయులు, రాజు, శేఖర్, పూజారి శ్రీనివాసులు, కోట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## మానసిక దివ్యాంగ చిన్నారులతో రాఖీ పండుగ జరుపుకున్న ఎంపీ ,ఎమ్మెల్యే

**- ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆప్యాయంగా రాఖీలు కట్టిన మానసిక దివ్యాంగ చిన్నారులు**




**ఉమ్మడి వరంగల్, ఆగస్టు 28 (నేటి దర్శిని బ్యూరో):** సోదర సోదరీమణుల అనురాగానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ వేడుకలను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హన్మకొండ కనకదుర్గ కాలనీలోని తమ నివాసంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం మానసిక దివ్యాంగ చిన్నారుల సమక్షంలో అత్యంత వైభవంగా, ఆత్మీయ వాతావరణంలో జరుపుకున్నారు.ఈ సందర్భంగా మల్లికాంబ మనోవికాస కేంద్రం నుంచి వచ్చిన మానసిక దివ్యాంగ చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య కి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి రాఖీలు కట్టారు. పిల్లలు చూపించిన స్వచ్ఛమైన ఆప్యాయతకు ఎంపీ, ఎమ్మెల్యే భావోద్వేగానికి గురయ్యారు. రాఖీలు కట్టిన చిన్నారులకు ఎంపీ, ఎమ్మెల్యేలు స్వయంగా మిఠాయిలు తినిపించి, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులతో కాసేపు సరదాగా మాట్లాడి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ పండుగలు, వేడుకలు అంటే కేవలం మన కుటుంబ సభ్యులతోనే కాకుండా, సమాజంలో ప్రత్యేక ఆదరణ, ప్రేమాభిమానాలు అవసరమైన దివ్యాంగ పిల్లలతో కలిసి జరుపుకోవడంలోనే నిజమైన సంతృప్తి, ఆనందం ఉంటుందని తెలిపారు. మానసిక దివ్యాంగ పిల్లలకు సమాజంలో సరైన ప్రోత్సాహం, అనురాగం అందిస్తే వారు కూడా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని అన్నారు. దివ్యాంగ చిన్నారులను ఆప్యాయంగా చూసుకుంటూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్న మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులను, ఉపాధ్యాయులను అభినందించారు. దివ్యాంగ పిల్లల సంక్షేమానికి, మల్లికాంబ మనోవికాస కేంద్రం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.ఈ వేడుకల్లో మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు, ప్రతినిధులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# కాంగ్రెస్‌లో కలుపు మొక్కలు



తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటు కొత్తేమీ కాదు.. ఇవే మొదలు కాదు..ఇవే చివరికి కూడా కావు. అధికారం ఉంటే ఒక రకమైన కొట్లాట ఉంటుంది. లేకుంటే మరో రకమైన కొట్లాట ఉంటుంది. ఇవన్నీ కూడా ఆధిపత్యపోరులో భాగమే. ఒకరంటే ఒకరికి పడదు. ఒకరంటే ఒకరికి గిట్టదు. ప్రజల పేరు చెప్పి, పథకాల పేరు చెప్పి డంబాచారాలు ప్రచారం చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ఏ ఒక్కరు కూడా సమయం వెచ్చించి ప్రజా సమస్యలపై మాట్లాడరు. తాజా పరిణామాలను పరిశీలిస్తే...రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ఇప్పుడున్న కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోవడం లేదన్నది ముమ్మాటికి నిజం. రేవంత్ టిడిపి నుంచి కాంగ్రెస్‌లోకి రావడం అన్నదే వారు చూసారు తప్ప కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకుని వచ్చారన్న నిజాన్ని పట్టించుకోరు. అందుకే అడపాదడపా వారు నోరు పారేసుకుంటారు. మేమున్నామని చెప్పుకునే ప్రయత్నం చేస్తుంటారు. మంత్రిగా కొండా సురేఖ పెద్దగా పొడించిందేమీ లేదు. దేవాదాయశాఖలో ఎన్ని గుళ్లుల ఉన్నాయో, ఎంతమంది పూజారులు ఉన్నారో, ఎలాంటి పూజాదిక వ్యవస్థ మనదగ్గర ఉందో ఆమెకు తెలియదు. బ్రోచర్లు విడుదల చేయడం, బోనాలెత్తడం తప్ప ఈ మూడేళ్లలో ఆమె చేసింది శూన్యం. దేవాలయాలు కునారిల్లుతున్నాయి. ధూపదీప నైవేద్యాలు అందడం లేదు. అన్యాక్రాంతం అయిన భూముల్లో ఇంచు భూమి కూడా ఆమె వెనక్కి తీసుకోలేదు. గ్రామాల్లో దేవాలయాల భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి, కొందరు ఏకంగా పట్టాలు చేసుకున్నారు. ఉమ్మడి వరగంల్ జిల్లాలోనే ఇలా వందలాది ఎకరాలు ఉంటాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట చెన్నకేశవస్వామి దేవాలయ భూములు కౌలు చేస్తున్నవారే పట్టాలు చేయించుకున్నారు. జీడికల్ భూములు, కొండాపూరం భూములు, ఇలా చెప్పుకుంటూ పోతే ఊరికో చరిత్ర ఉంది. ఆమె ఏనాడూ ఈ భూముల గురించి మాట్లాడడం లేదు. అటవీ శాఖ మంత్రిగా అసలు ఒక్క మొక్కయినా నాటి పెంచారా అన్న అనుమానం కలుగుతుంది. ఎపిలో పవన్ కళ్యాణ్ సామాజిక వనాల పెంపునకు పాల్పడుతుంటే ఇక్కడ కనీసం వరమహోత్సవాలు లేవు. ఉన్నా మొక్కుబడిగా సాగుతున్నాయి. ఇవన్నీ వదిలేసి కూతురుతో సిఎం రేవంత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయించి, తనకేమీ సంబంధం లేదన్నట్లుగా మాట్లాడడం వారికే చెల్లింది. నిజానికి ఆమె దేవాలయాలను పట్టించుకుని, అడవులను పట్టించుకుని ఉంటే జనం ఆమె అంటే అభిమానం చూపేవారు. కానీ కూతరు రాజకీయం ముఖ్యం. రాజకీయాలు తప్ప ప్రజల సేవ ముఖ్యం కాదు. ఇక చిన్నరెడ్డి కూడా అంతే. ప్రణాళికి సంఘం ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. ప్రజావాణిలో వచ్చిన అనేక ముఖ్యమైన సమస్యలు ఏమిటో వాటిని ఎలా పిరష్కరించారో చెప్పలేరు. రాజగోపాల రెడ్డికి మంత్రి పదవి కావాలి. ఆయన జీవిత ధ్యేయం అదే. అందుకే ఇప్పుడు కాంగ్రెస్‌లో డ్రామాలు నడుస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ దశదిశా లేకుండా వ్యవహరించింది. కెసిఆర్‌ను నమ్మిన ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మలేదు. అందుకే అధికారం లోకి రావడానికి తొమ్మిదిన్నరేళ్లు పట్టింది. ఇది కూడా కాంగ్రెస్ పార్టీని చూసి ఓటేయలేదు. కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావుల అవినీతి కార్యక్రమాలతో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. ఈ విషయం కాంగ్రెస్‌కు అర్థం కావడం లేదు. నిజానికి కాంగ్రెస్‌లో బలమైన నేతగా ఎదిగిన అవకాశం ఉమ్మడి ఎపిలో ఒక్క రాజశేఖర్ రెడ్డికే సొంతం. ముఖ్యమంత్రిగా దాదాపు మూడేళ్లు పూర్తిచేసుకోబోతున్న రేవంత్‌రెడ్డి బలమైన నాయకుడిగా ఎదగలేక పోయారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆ పార్టీ సంస్కృతిలో భాగమని ఊరుకోక తప్పదు. ఎందుకంటే కొండాసురేఖ,చిన్నారెడ్డిలపై కఠిన చర్యలు తీసుకునే సాహసం కాంగ్రెస్ నేతలు చేయరు. నిజంగానే వీరిద్దరిని పీకి అవతల పడేస్తే కాంగ్రెస్‌లో చురుకు పుడుతుంది. కాంగ్రెస్ బలం పెరుగుతుంది. జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య పార్టీని వీడితే ఏమయ్యింది. వీరు పోయినా ఏమీ కాదు. రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ కొంత మంది కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. అంతర్గత కుమ్ములాటలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఏవగింపు ఏర్పడింది. బిఆర్‌ఎస్‌ను మించి పాలన సాగిస్తారని అనుకుంటే మంత్రులంతా పర్సంటేజీల ఖాతాలు తెరిచారు. గ్రామస్థాయిలో అవినీతి మరింత పెరిగింది. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు ఎక్కుపెట్టడం భరిస్తూ పోతే వీరి జాబితా పెరగడమే తప్ప తగ్గదని గురించాలి. రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కిక్కురుమనకుండా పనిచేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాత్రం తలలు ఎగరేస్తున్నారు. ఈ ఇద్దరు నేతు ఏ పార్టీలోకైనా వెళ్లి రాగలరని ఇప్పటికే రుజువయ్యింది. బిఆర్‌ఎస్ పాలనను నిలదీస్తూ...ముఖ్యమంత్రి కేసీఆర్‌ను దీటుగా ఎదుర్కొనే సత్తా రేవంత్‌రెడ్డికి మాత్రమే ఉందన్న నమ్మకంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్‌ను తొలగించడం రేవంత్‌రెడ్డికి కలిసొచ్చింది. కేసీఆర్ పోకడల పట్ల విముఖంగా ఉన్న ప్రజలు ప్రత్యామ్నాయ నాయకుడిగా రేవంత్‌రెడ్డిని ఎంచుకున్నారే తప్ప కాంగ్రెస్‌పైనో లేదా రాహుల్‌పైనో ప్రేమతో కాదు. కేసీఆర్‌కు ప్రత్యామ్నాయం ఎవరన్న ప్రశ్న ఉదయించినప్పుడు, తాను ఉన్నానన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించడంలో రేవంత్‌రెడ్డి విజయం సాధించడంతోనే ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. అధికారం దక్కాక ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో మంత్రులదీ పెద్ద పాత్రే ఉంది. అయితే పాత కాంగ్రెస్ సంస్కృతిని మరవకపోవడంతో పార్టీలో క్రమశిక్షణ కట్టుతప్పింది. వీరివల్ల ఎన్నుకున్న ప్రజలకు రాష్ట్ర ప్రజలకు ఉపయోగం లేదన్న ప్రచారం బాగా వ్యాప్తి చెందుతున్న వేళ కొండా సురేఖ లాంటి వారి చర్యలు కాంగ్రెస్‌కు బలహీనతే తప్ప బలం కాదు. వీరిని వదిలించుకుంటే తప్ప మేలు జరగదు. కాంగ్రెస్ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# యూఎస్ పోస్టల్ సర్వీస్‌కు షాక్

**మెయిల్ ఓటింగ్ ప్రణాళిక అమలుకు బ్రేక్**




**బోస్టన్ :ఆగస్టు 28 (నేటి దర్శిని)**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేస్తున్న కార్యనిర్వాహక ఉత్తర్వులకు న్యాయస్థానాలలో చుక్కెదురు అవుతూనే ఉంది. మెయిల్ ఓటింగును పరిమితం చేస్తూ ఆయన జారీ చేసిన ఉత్తర్వును రెండు వారాల పాటు అమలు చేయకుండా యూఎస్ పోస్టల్ సర్వీసును (యూఎస్‌పీఎస్) బోస్టన్‌లోని ఫెడరల్ జడ్జి నిలువరించారు యూఎస్‌పీఎస్ నిబంధనల అమలును డెమొక్రటిక్ పాలిత రాష్ట్రాలు, ఓటర్ అడ్వొకసీ గ్రూపులు న్యాయస్థానంలో సవాలు చేశాయి. పిటిషన్లపై విచారణ జరిపిన అనంతరం యూఎస్‌పీఎస్ నిబంధన అమలును తాత్కాలికంగా నిలిపివేస్తూ బోస్టన్ న్యాయమూర్తి గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. నిబంధన రాజ్యాంగ విరుద్ధమని, దీనిని జారీ చేసే అధికారం యూఎస్‌పీఎస్‌కు లేదని పిటిషనర్లు చేస్తున్న వాదనకు అంతిమంగా విజయం చేకూరే అవకాశం ఉన్నదని న్యాయమూర్తి ఇందిరా తల్వానీ చెప్పారు. నిబంధనలపై ప్రాథమిక ఇంజక్షన్ ఆదేశాలు ఇవ్వాలా వద్దా అనే అంశంపై వచ్చే గురువారం ఆమె విచారణ జరుపుతారు.

# చైనా యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తున్న బంగ్లాదేశ్



**ఢాకా :(నేటి దర్శిని)**

చైనా నుంచి 2.3 బిలియన్ డాలర్ల విలువైన ఇరవై జే -- 19 సీఈ బహుళ ప్రయోజక యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలని బంగ్లాదేశ్ భావిస్తోంది. బంగ్లాదేశ్ జరిపిన అతి పెద్ద రక్షణ కొనుగోళ్లలో ఇది కూడా ఒకటి కాబోతోంది. గత సంవత్సరం ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనాకు చెందిన జే- 10 విమానాల పనితీరును గమనించిన బంగ్లాదేశ్ ఈ నిర్ణయానికి వచ్చింది. బంగ్లాదేశ్ వైమానిక దళాన్ని ఆధునీకరిం చాలని తారిఖ్ రెహమాన్ ప్రభుత్వం అనుకుం టోంది. మూల ధర 62.7 మిలియన్ డాలర్ల కంటే చాలా ఎక్కువగా ఒక్కో యుద్ధ విమానం కొనుగోలుకు సుమారు 115 మిలియన్ డాలర్లు వెచ్చించాలని ప్రతిపా దించింది. అదనపు వ్యయంలో శిక్షణ, పరికరాలు, సాంకేతిక- లాజిస్టిక్ మద్దతు, రవాణా, బీమా, వ్యాట్, నిర్మాణ పనులు కలిసి ఉంటాయి. కాగా చైనా నుంచి యుద్ధ విమానా లను కొనుగోలు చేస్తున్న సమాచారాన్ని బంగ్లాదేశ్ ప్రధాని సమాచార, ప్రసార సలహాదారు జాహెద్ ఉర్ రెహమాన్ ధృవీకరించారు.

# విద్యార్థులపై ప్రాణాంతక బల ప్రయోగం!

**-ఢిల్లీ, బీహార్ నిరసనలపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక**


**-పోలీసు చర్యలపై కొరవడిన జవాబుదారీతనం**



**న్యూఢిల్లీ:ఆగస్టు 28 (నేటి దర్శిని)**

ఢిల్లీలో జెన్-జీ జూలైలో చేపట్టిన నిరసనలపై పోలీసుల స్పందనను డాక్యుమెంట్ చేస్తూ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఒక డిజిటల్ విచారణ నివేదికను ప్రచురించింది. ఆగస్టు 24న ప్రచురించిన ఈ విచారణ నివేదికలో.. భారత పోలీసులు శాంతియుత నిరసనకారులపై చట్టవిరుద్ధమైన, ప్రాణాంతకమైన బలాన్ని ప్రయోగించారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ 'ఎవిడెన్స్ ల్యాబ్' వీడియో, ఫొటో ఆధారాలను పరిశీలించి ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఢిల్లీ, బిహార్‌లోని సీవాన్‌లో నిరసనకారులపై పోలీసులు పెల్లెట్ గన్స్, టియర్ గ్యాస్, గ్రెనేడ్లు, లాఠీలు, ఎలక్ట్రిక్ షాక్ పరికరాలు వంటి ఆయుధాలను ఉపయోగించినట్టు స్పష్టం చేసింది.బలప్రయోగం ద్వారా నిరసనలను అణచివేయడానికి భారత అధికారులు యత్నించారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా బోర్డు చైర్‌పర్సన్ ఆకార్ పటేల్ ఆరోపించారు. ఈ రకమైన తీవ్రమైన స్పందన అనేది శాంతిభద్రతల నియంత్రణ ముసుగులో ప్రభుత్వం చేసిన హింసగా తెలిపారు. నెలరోజులు గడిచినా ఎవరిపైనా చర్యలు తీసుకోకపోవడమే దీనికి నిదర్శనం అని ఆయన అన్నారు. పెల్లెట్ గాయాలపాలైన ఒక నిరసనకారుడు మాట్లాడుతూ.. ఆర్‌ఏఎఫ్ సిబ్బంది మొదట టియర్ గ్యాస్ ఉపయోగించారని, తర్వాత పెల్లెట్ తుపాకులను ప్రయోగించారని ఆరోపించాడు. అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా వెనుకభాగంలో గుండ్లు దిగాయని, దాదాపు 25 నుంచి 30 పెల్లెట్ గాయాలయ్యాయని పేర్కొన్నాడు. ఆ గాయాలు పెల్లెట్ల వల్లే అయ్యాయని హాస్పిటల్‌లోని వైద్యులు ధ్రువీకరించారని తెలిపాడు. ఢిల్లీ పోలీస్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది నిరసనకారులను లాఠీలతో కొడుతున్న ఎనిమిది వీడియోలను కూడా అమ్నెస్టీ ధ్రువీకరించింది. ప్రత్యక్షంగా ఎలాంటి ముప్పు కలిగించనివారిని, ఒక చిన్న బాలుడిని అధికారులు కొడుతున్న దృశ్యాలు ఆ ఫుటేజీలో ఉన్నాయి. కొన్ని వీడియోలలో సాధారణ దుస్తులతో ఉన్న వ్యక్తులు నిరసనకారులను లాఠీలతో కొడుతూ కనిపించారు. ఈ ఆధారాలు నిరసనకారులపై బలప్రయోగం, పోలీసు చర్యలకు జవాబుదారీతనం లేకపోవడంపై మళ్లీ ప్రశ్నలను రేకెత్తించాయి.

# పాకిస్తాన్ ఐఎస్ఐ కోసం పని చేస్తున్న భారతీయ జంట..



**న్యూఢిల్లీ, ఆగస్టు 28 (నేటి దర్శిని)**

పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేస్తున్న దంపతుల్ని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి పోలీసులు కీలక వివరాలు రాబట్టారు. అరెస్టైన జంటను మొహమ్మద్ సాహిల్, అతడి భార్య సమీరగా గుర్తించారు. వీరి అరెస్టుకు సంబంధించిన వివరాల్ని పోలీసులు శుక్రవారం వెల్లడించారు. సాహిల్, సమీర జంట ఢిల్లీలోని సరాయ్ కాలే ఖాన్ ప్రాంతంలో ఉంటున్నారు. సాహిల్ 2001లో ఉత్తర ప్రదేశ్‌లోని బదాయున్ ప్రాంతానికి చెందినవాడు.అతడు త్వరలో ఎల్ఎల్‌బీ చదివేందుకు ప్లాన్ చేసుకున్నాడు. 2005లో బిజ్నూర్‌కు చెందిన సమీర ఇంటర్ పూర్తి చేసింది. వీరిద్దరూ కొంతకాలంగా పాకిస్తాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్) సంస్థతో కలిసి పని చేస్తున్నారు. భారతీయ నిఘా వ్యవస్తలు అందించిన సమాచారం ఆధారంగా నార్తర్న్ రేంజ్ ఆఫ్ ద స్పెషల్ సెల్ పోలీసులు ఈ దంపతుల్ని అరెస్టు చేశారు. సాహిల్ 2024 నుంచి పాకిస్తాన్ కోసం పనిచేస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అక్కడి వారిని సంప్రదిస్తుంటాడు. అతడితోపాటు భార్య సమీర కూడా పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేస్తుంటుంది. ఈ ఇద్దరికీ తగిన ఆర్థిక సాయం అందిస్తామని పాక్ ఏజెంట్లు హామీ ఇవ్వడంతో ఇద్దరూ గూఢచర్యం చేస్తున్నారు. పాక్ వారికి అనుకూలంగా ఉండేవారిని ఇంకా సభ్యులుగా చేర్పించడం, అలాగే వారికి రవాణ సదుపాయం చేయడం వంటి పనుల్ని పాక్ ఐఎస్ఐ అప్పగించింది. ఈ జంట ఇక్కడ ఎనిమిది సిమ్ కార్డులు కొని, దుబాయ్ ద్వారా పాకిస్తాన్ పంపింది. ఈ సిమ్ కార్డులకుగాను వారికి రూ.30,000 అందాయి. ఈ ఇండియా నెంబర్లను పాకిస్తాన్ నుంచి ఆపరేట్ చేస్తున్నారు.వీటికి సంబంధించిన వాట్సాప్ కూడా యాక్టివేట్ అయింది. ఈ నెంబర్ల ద్వారా నిఘా సంబంధిత కార్యకలాపాలు చేపడుతున్నారు. ఇండియన్ నెంబర్లతో పాకిస్తాన్ వాళ్లు అనేక ఇండియన్ వాట్సాప్ గ్రూపుల్లోకి ఎంటర్ అయ్యారు. ఇండియాలోని కంటోన్మెంట్ ప్రాంతాల్లో ఈ జంట పర్యటించి, అక్కడి సమాచారాన్ని కూడా వారికి చేరవేసింది. ఈ దంపతులకు సంబంధించిన ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. ప్రస్తుతం వీరికి సంబంధించిన విచారణ కొనసాగుతోంది.

# పరీక్షల్లో సంస్కరణలపై సూచనలివ్వండి.

**- విద్యార్థులు, తల్లిదండ్రులను కోరిన టాస్క్‌ఫోర్స్**



**న్యూఢిల్లీ, ఆగస్టు 28 (నేటి దర్శిని)**

ప్రభుత్వం నిర్వహించే వివిధ రకాల పరీక్షలకు సంబంధించి సంస్కరణలపై సలహాలు, సూచనలు ఇవ్వాలంటూ నందన్ నీలేకని నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ కమిటీ కోరింది. ప్రభుత్వ పరీక్షల నిర్వహణ, భద్రత, మూల్యాంకన పద్ధతి తదితర అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఇతర సంస్థల నుంచి వీటిని ఆహ్వానిస్తున్నది. ఇంగ్లిష్, హిందీ, ప్రాంతీయ భాషల్లో సెప్టెంబర్ 13లోగా వాటిని టాస్క్‌ఫోర్స్‌కు సమర్పించాలని కేంద్రం తాజాగా ఒక ప్రకటన జారీ చేసింది.నీట్ పేపర్ లీక్ అనంతరం ఎన్‌టీఏ సహా వివిధ రకాల ప్రభుత్వ పరీక్షల్లో సంస్కరణలపై కేంద్రం ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. పటిష్ఠమైన, సురక్షితమైన, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయటమే లక్ష్యంగా టాస్క్‌ఫోర్స్ కమి టీ పనిచేయనున్నదని కేంద్రం తెలిపింది.

# 22ఏ బాధితులకు అండగా బీఆర్ఎస్ పోరాటం...

**-కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గే వరకు అవిశ్రాంత ఉద్యమం: ఎమ్మెల్యే జీఎంఆర్..**
**-శనివారం నిరసన గళం సభకు మాజీ మంత్రి హరీష్‌రావు హాజరు...**

**పటాన్ చెరు ఆగస్టు 28 (నేటి దర్శిని):** 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేరిన భూముల బాధితులకు అండగా బీఆర్ఎస్ పార్టీ శనివారం పటాన్చెరులో నిర్వహించనున్న "నిరసన గళం" సభను విజయవంతం చేయాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. బాధితుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం జిన్నారం, గుమ్మడిదల, పటాన్చెరు మండలాలు, మున్సిపాలిటీలకు చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. నిరసన సభ ఏర్పాట్లు, నాయకులు, కార్యకర్తలు, 22ఏ బాధితులను పెద్ద సంఖ్యలో తరలించే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పటాన్చెరు నియోజకవర్గంలో వివాదాలు లేని ప్రైవేట్, పట్టా భూములు, రిజిస్టర్డ్ ఇళ్లను కూడా 22ఏ జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.




భూములను విక్రయించుకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక, ఆస్తులను వినియోగించుకోలేక బాధితులు ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ జాబితా నుంచి పేర్లు తొలగిస్తామంటూ కొందరు దళారులు బాధితులను మోసం చేస్తూ భారీ కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22ఏ సమస్యకు ప్రభుత్వం పారదర్శకంగా, శాశ్వత పరిష్కారం చూపాలని కోరిన ఎమ్మెల్యే, బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యను పరిష్కరించే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. పటాన్చెరులోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న నిరసన గళం సభకు మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా 22ఏ భూముల బాధితులు భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## మార్కండేయ దేవాలయంలో నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘం అధ్యక్షునికి ఘన సన్మానం



**ఆమనగల్లు, ఆగస్టు 28(నేటి దర్శిని);** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని శివ భక్త మార్కండేయ దేవాలయంలో నూతనంగా ఎన్నుకోబడిన ఆమనగల్లు చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ ను మార్కండేయ దేవాలయ కమిటీ శుక్రవారం సన్మానించింది. 40 పూర్ణిమ గాయత్రి యజ్ఞోపవీత ధారణ సందర్భంగా దేవాలయ ఆవరణలో పద్మశాలి కుల బాంధవుల సమక్షంలో చేనేత సహకార సంఘం అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన గాజుల శ్రీనివాసును పద్మశాలి కుల పెద్దలు, ముఖ్య నాయకులు వారిని శాలువాలతో, పూలమాలలతో సన్మానించి వారిని అభినందించి, మరెన్నో ఉన్నత పదవులను అలంకరించాలని ఆశిస్తూ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అవ్వారి శివలింగం, ఎంగలి రఘు, గాజుల సత్య రాములు,అప్పం శ్రీను, భీమనపల్లి దుర్గయ్య,వాసు, మధు,గుజ్జరి శ్రీనివాస్, ఎంగలి యాదగిరి, మామిడి శెట్టి రవి, అప్పం అలివేలు,పద్మశాలి కుల బాంధవులు, మహిళలు,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు



**ఆమనగల్లు, ఆగస్టు28 (నేటి దర్శిని):** ఆమనగల్లు మండలం రాంనుంతల చిన్న తండాలోని తుల్జా భవానీ మాత ఆలయ అభివృద్ధికి మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు తనవంతు సహకారంగా రూ.25.000 విరాళంగా అందించారు. ఆలయ అభివృద్ధికి తండావాసి బీక్య నాయక్ రూ.21.000 విరాళంగా అందించారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించడం పట్ల తండావాసులు హర్షం వ్యక్తం చేస్తూ, దాతలు మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, బీక్య నాయక్ ని శాలువాతో సత్కరించి,కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం పట్ల తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సరిత పంతు నాయక్, జీంత నాయక్, నాను నాయక్, తెజురాం, రవి, నర్సింగ్, వినోద్, వెంకటేష్,రాము, పరమేష్, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

# అనుబంధానికి ప్రతిక... రాఖీ వేడుక




బంగ్లా స్వాతి లక్ష్మీకాంత్ రెడ్డి



కూచూరు భీమ్ రెడ్డి, వారి సోదరి

**- మిడ్జిల్ సింగల్ విండో చైర్మన్ కుచూరు శ్రీనివాసరెడ్డి**



**మిడ్జిల్, ఆగస్టు 28 (నేటి దర్శిని):** మిడ్జిల్ సింగల్ విండో చైర్మన్ కూచూరు శ్రీనివాస్ రెడ్డి వారి నివాసంలో అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి రాఖీ పౌర్ణమి ప్రతీక అని,రక్షాబంధన్ పర్వదినాన శ్రీనివాస్ రెడ్డి,జితేందర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి కి సోదరి బంగ్లా స్వాతి లక్ష్మీకాంత్ రెడ్డి రాఖీ కట్టి సీట్లు తినిపించారు. సోదరికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అక్కా, తమ్ముళ్ల, అన్నా,చెల్లెళ్ల వెల కట్టలేని ఆప్యాయతలు, అనురాగాలకు ఈ పండుగ నిలువెత్తు నిదర్శనమన్నారు. రక్షా బంధన్‌ను కుటుంబసభ్యుల మధ్య ఆనందోత్సాహాలతో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

# గులాబీ గూటికి బీజేపీ సీనియర్ నేత..

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక**



**జిన్నారం ఆగస్టు 28 (నేటి దర్శిని)** జిన్నారం మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీకి చెందిన సీనియర్ యువ నాయకుడు, సోషల్ మీడియా అధ్యక్షుడు సీతారాజు యాదవ్ బీజేపీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశం గౌడ్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్దన్ ముదిరాజ్, కౌన్సిలర్ శిల్పా నాగరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతారాజు యాదవ్ మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన పలు సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడై బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. జిన్నారం ప్రాంత అభివృద్ధితో పాటు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అందిస్తున్న సేవలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు తనను ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. ఇకపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తా**

బీఆర్ఎస్ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతూ పార్టీకి అండగా ఉంటానని సీతారాజు యాదవ్ తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశం గౌడ్, మున్సిపల్ చైర్మన్ జనార్దన్ ముదిరాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేష్, ఐదో వార్డు కౌన్సిలర్ శిల్పా నాగరాజ్ యాదవ్, బండి శ్రీకాంత్ గౌడ్, మంద రమేష్, బ్రహ్మేంద్ర గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నీకిల్ గౌడ్, దుబ్బాక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం

**చింతపల్లి, ఆగస్టు 28 (నేటి దర్శిని) :** భక్తుల పాలిట కొంగుబంగారంగా ప్రసిద్ధి చెందిన చింతపల్లి మండలం కుర్మపల్లి గ్రామంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. సుమారు 136 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని గ్రామంలో జాతర, బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం ఆలయంలో కొలువుదీరిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, శ్రీ కాళికాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

**29న బ్రహ్మోత్సవాలు**

ఈ నెల 29న శనివారం ఉదయం యజ్ఞాలు నిర్వహించిన అనంతరం స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. 30న బోనాల వేడుకలు 30న ఆదివారం ఉదయం వివిధ రకాల పూజలు, అమ్మవారి ఘటాల అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు అమ్మవారికి ఒడిబియ్యం వేడుక జరగనుంది. సాయంత్రం 6 గంటలకు బోనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 31న బోనాల ఊరేగింపు31న సోమవారం సాయంత్రం 4



గంటలకు బోనాల ఊరేగింపు, రాత్రి 7 గంటలకు రంగుల వేడుకలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 1న శ్రీ ఈశ్వరీమాత పవళింపు సేవను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వెల్లడించింది. భక్తులకు అన్ని ఏర్పాట్లుబ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ముంజంపల్లి విద్యాధరాచారి తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

# కాజీపేటకు అదనపు రైలు హాల్టులు కల్పించాలి

**- కోవిడ్ తర్వాత నిలిచిన రైళ్లను పునరుద్ధరించాలి: కాంగ్రెస్ నాయకుడు రహమతుల్లా**





**ఉమ్మడి వరంగల్, ఆగస్టు 28 (నేటి దర్శిని బ్యూరో):** కాజీపేట రైల్వే జంక్షన్‌లో మరిన్ని ముఖ్యమైన రైళ్లకు హాల్టులు కల్పించాలని, కోవిడ్-19 అనంతరం నిలిపివేసిన రైలు సర్వీసులను పునరుద్ధరించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు రహమతుల్లా మహమ్మద్ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రహమతుల్లా మహమ్మద్ మాట్లాడుతూ కాజీపేట మీదుగా అనేక ముఖ్యమైన రైళ్లు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, కొన్ని రైళ్లకు కాజీపేటలో హాల్టు లేకపోవడంతో వరంగల్, హనుమకొండ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వందే భారత్, కర్ణాటక సంపర్క్ క్రాంతి, యశ్వంత్‌పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం--సికింద్రాబాద్ గరీబ్ రథ్ రైళ్లకు కాజీపేటలో హాల్టు కల్పించాలని కోరారు. దీనివల్ల ఈ ప్రాంత ప్రజలకు హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. అలాగే కోవిడ్-19 తర్వాత నిలిపివేసిన కాజీపేట--బెలగావి ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఇతర రైలు సర్వీసులను కూడా పునరుద్ధరించేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే బోర్డు దృష్టికి సమస్యను తీసుకెళ్లి అవసరమైన ప్రతిపాదనలు చేయాలని ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కోరారు. కాజీపేటకు అదనపు రైలు హాల్టులు, నిలిచిపోయిన రైలు సర్వీసుల పునరుద్ధరణ జరిగితే వరంగల్--హనుమకొండ ప్రాంతాల విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రహమతుల్లా మహమ్మద్ తెలిపారు.

# భారతీయ రక్షణ వ్యవస్థలో సైనిక సేవలు స్ఫూర్తిదాయకం

**- హైదరాబాద్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ బి శ్రీనివాస్ రెడ్డి, లయన్ కవిత హీరానందాని**





**హైదరాబాద్ సిటీ బ్యూరో, ఆగస్టు 28 (నేటి దర్శిని):** భారతీయ రక్షణ వ్యవస్థలో సైనికుల సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని హైదరాబాద్ లయన్స్ క్లబ్ (బంజారా పెర్ల్స్) ప్రతినిధులు లయన్ బి శ్రీనివాస్ రెడ్డి, లయన్ కవిత హీరానందానిలు పేర్కొన్నారు. రక్షాబంధన్ పండుగ పురస్కరించుకొని హైదరాబాద్ సీఆర్పీఎఫ్ క్యాంపులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వారు ఇరువురు ప్రతినిధులతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై సైనికులకు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మీయులకు అనుబంధానికి ప్రతీకగా భారతీయ సాంప్రదాయంలో రాఖీ పండుగకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ముఖ్యంగా భారతీయ సమస్త ప్రయాణికం సైనికుల రక్షణ వలయంలో జీవనం సాగిస్తున్న క్రమంలో సైనికుల సేవలను గుర్తించి సాంప్రదాయ బద్ధమైన రక్షాబంధన్ లో సైనికులకు రాఖీ కట్టడం తమకేంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టీ శ్రీలత, అమ్మానాన్న వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, సిఆర్పిఎఫ్ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు లో ఘనంగా 40వ నూలు పూర్ణిమ గాయత్రీ యజ్ఞోపవీత ధారణ



**ఆమనగల్లు, ఆగస్టు28(నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని భక్త మార్కండేయ దేవస్థానంలో శుక్రవారం 40వ నూలు పూర్ణిమ గాయత్రీ యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివ భక్త మార్కండేయ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు,వేద పండితులు విజ్ఞే శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గాయత్రీ యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని చేపట్టారు.అనంతరం ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ గాయత్రీ యజ్ఞోపవీత ధారణ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్‌ను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో గాజుల సత్యరాములు, అప్పం శ్రీను, ఎంగలి శ్రీధర్,దోర్నాల ఈశ్వరయ్య, వాసు, తిరుపతయ్య,యాదగిరి, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాసులు, గుర్రం సురేష్, సుధీర్,రవీందర్,శ్రీధర్, గుద్దేటి మహేష్, దినేష్, రవి, అవ్వారి శివలింగం, బావుండ్ల నరసింహ, బోడ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాల కట్టడిలో ముగ్గురు కమిషనర్లు విఫలం


జీహెచ్ఎంసీ కమీషనర్


ఎంఎంసీ కమీషనర్


సీఎంసీ కమీషనర్

**-ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ.. చర్యలు మాత్రం శూన్యం**
**-జోనల్ కమిషనర్ల మౌనమే అక్రమ నిర్మాణాలకు అండగా మారిందా.?**
**-అధికారుల నిర్లక్ష్యంతో గ్రేటర్ హైదరాబాద్ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు**
**-అంజయ్య నగర్ సంఘటనతో ఇకనైనా కమిషనర్లు కఠిన చర్యలు తీసుకునేనా.?**
**-కార్మికుల ప్రాణాలు పోతున్న, ప్రభుత్వ ఆదాయం భారీగా గండి కొడుతున్న అధికారులలో చలనం లేకపాయే.?**

హైదరాబాద్,ఆగస్టు28 (నేటి దర్శిని): గ్రేటర్ హైదరాబాద్‌లోని మూడు మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు రోజురోజుకూ పెరుగుతున్నా వాటిని కట్టడి చేయాల్సిన ఉన్నత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజావాణిలో ప్రజలు ఎన్నో ఫిర్యాదులు చేస్తున్నా వాటిపై కఠిన చర్యలు ఎక్కడ కనిపించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ముగ్గురు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, జోనల్ సిపి స్థాయి అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నా ఫలితం మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

**సాధారణ, ప్రజావాణి ఫిర్యాదులు బుట్టదాఖలా.?**
ప్రజావాణిలో అక్రమ నిర్మాణాలపై ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.? వాటిలో ఎన్ని పరిశీలించారు.? ఎన్ని నిర్మాణాలపై నోటీసులు ఇచ్చారు.? నోటీసులు ఇచ్చిన తర్వాత నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయి.? సీజ్ చేసిన భవనాలు ఎన్ని.? సీజ్ చేసిన తర్వాత ఎన్ని నిర్మాణం పూర్తి చేసుకొని వినియోగంలో ఉన్నాయి.? ఎన్ని కూల్చివేశారు.? ఎన్ని కేసులు నమోదు చేశారు.? ఎన్ని ఫిర్యాదులు పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉన్నాయి.? అనే వివరాలను కమిషనర్లు బహిర్గతం చేయగలరా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వాటిని బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. ఒక్క ఫిర్యాదుపై అయిన పూర్తి స్థాయిలో చర్య తీసుకున్నారా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ఉన్నత అధికారుల మౌనం ఎందుకు.?**
చైన్‌మెన్ నుంచి న్యాక్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్, ఏసీపీ, డిప్యూటీ కమిషనర్, జోనల్ ఏసీపీ, జోనల్ కమిషనర్ స్థాయి వరకు పర్యవేక్షణ వ్యవస్థ ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలు ఎలా పుట్టుకొస్తున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. కొందరు అధికారులు లంచాల తీసుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనేది బహిరంగ రహస్యమే. ఇబ్బంది, అధికారులు అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయించి వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**పత్రికల్లో కథనాలు వచ్చినా స్పందన ఏది.?**
అక్రమ నిర్మాణాలపై పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమైనా ముగ్గురు కమిషనర్లు, సంబంధిత జోనల్ కమిషనర్లు, జోనల్ సీపీలు, డిప్యూటీ కమిషనర్లు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలు, జర్నలిస్టులు అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారినే ఇబ్బందులకు గురి చేయడం, అక్రమ నిర్మాణదారులతో చెప్పి తప్పుడు కేసులు పెట్టడం వంటి అనేక ఆరోపణలు కూడా అధికారులపై వినిపిస్తున్నాయి.
అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే వారిని కాకుండా అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


**సంఘటన జరిగినప్పుడే హడావుడినా.?**
ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, కోర్టు ఆదేశాలు వచ్చినప్పుడు లేదా ముఖ్యమంత్రి సీరియస్ అయినప్పుడు మాత్రమే అధికారులు హడావుడిగా ప్రకటనలు చేయడం, తనిఖీలు నిర్వహించడం, పేరుకు నాలుగైదు అక్రమ నిర్మాణాలు కూల్చివేయడం అంతే, తరువాత వారం రోజులకే పరిస్థితి మళ్లీ యథాతథంగా మారుతోందన్న విమర్శలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత కమిషనర్లు స్పందించడం కాదు. ప్రమాదాలకు కారణమయ్యే అక్రమ నిర్మాణాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

**విజిలెన్స్ నివేదికలపై చర్యలేవి.?**
అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ అధికారులు ఇచ్చిన నివేదికలు ఏమయ్యాయి.? వాటిపై తీసుకున్న చర్యలేంటి.? బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారా.? అన్నది కూడా స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. అవినీతి అధికారులపై నివేదికలు తయారవుతున్నా చర్యలు లేకపోతే అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయన్న అనుమానాలకు బలం చేకూరుతుంది. జిహెచ్ఎంసిలో విజిలెన్స్ విభాగం ఉండి కూడా ఇంత అవినీతి జరుగుతుంది అంటే మరి విజిలెన్స్ విభాగం ఉంది ఏం ఉపయోగమో ప్రభుత్వానికే తెలియాలి.

**కోర్టు స్టే లపై ఎందుకీ నిర్లక్ష్యం.?**
కోర్టు కేసులు, స్టే ఆర్డర్లు ఉన్న నిర్మాణాల విషయంలో డిప్యూటీ, జోనల్ కమిషనర్లు, ఇతర సంబంధిత అధికారులు నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నారా.? స్టే తొలగింపునకు కౌంటర్లు వేస్తున్నారా.? వేయకుంటే ఎందుకు వేయడం లేదు.? లేక వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగుతున్నా మౌనం వహిస్తున్నారా.? అన్నది తేలాల్సి ఉంది.గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు కమిషనర్ కార్యాలయాల పరిధిలో అధికారులు ప్రజల కోసం విధులు నిర్వహిస్తున్నారా.? లేక అక్రమాలకు అండగా నిలుస్తున్నారా.? అన్నది కమిషనర్లే తేల్చాలి. అక్రమ నిర్మాణాలపై వచ్చిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా సమీక్షించి, పెండింగ్ ఫిర్యాదులపై గడువుతో కూడిన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఉన్నత అధికారులు మౌనం వహిస్తే.. ఆ మౌనం వెనుక కారణమేంటో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది.

# నేపాల్ విపత్తుపై కేంద్ర విదేశాంగ మంత్రికి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లేఖ

**-భారత రాయబార కార్యాలయ అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడిన ఎంపీ**
**-తెలంగాణ రాష్ట్రనికి చెందిన బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించాలి**
**-గల్లంతైన వారి కోసం గాలింపు ముమ్మరం చేయాలి**
**-బాధితులను స్వదేశానికి తరలించాలి**



**ఉమ్మడి వరంగల్, ఆగస్టు 28 ( నేటి దర్శిని బ్యూరో):** నేపాల్‌లో సంభవించిన విపత్తు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రనికి చెందిన పలువురు గాయపడటం, కొందరు మృతి చెందడం, మరికొందరు గల్లంతైన నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కు లేఖ పంపించారు. బాధితుల పరిస్థితి, వారి కుటుంబాల ఆందోళనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం, సంబంధిత కాన్సులర్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం, అవసరమైన చికిత్స, ఆసుపత్రి సదుపాయాలు, మందులు తదితర అత్యవసర సహాయాన్ని అందించాలని ఎంపీ డా. కడియం కావ్య కోరారు.
అలాగే విపత్తులో మృతి చెందిన వారి మృతదేహాలను గుర్తించి, అవసరమైన అధికారిక ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి, భద్రంగా స్వదేశానికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు చేర్చే వరకు బాధిత కుటుంబాలకు అవసరమైన సహకారం అందించాలని కోరారు.ఇప్పటికీ ఆచూకీ తెలియని తెలంగాణకు చెందిన వారి కోసం నేపాల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ శోధన, సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. భారత రాయబార కార్యాలయం, నేపాల్ స్థానిక అధికారులు, రెస్క్యూ బృందాలు, సంబంధిత ఏజెన్సీలు గల్లంతైన వారి కుటుంబాలతో నిరంతరం సమన్వయం చేసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.
కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కు లేఖ పంపిన అనంతరం కాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయం ఉన్నతాధికారులతోనూ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. బాధితుల వివరాలు, సహాయక చర్యలు, గల్లంతైన వారి ఆచూకీ, మృతదేహాల గుర్తింపు, స్వదేశానికి తరలింపు వంటి అంశాలపై అధికారులతో చర్చించారు.బాధిత కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నందున వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ, ప్రతి ఒక్కరి ఆచూకీ కోసం అన్ని విధాలా ప్రయత్నాలు కొనసాగించాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు. నేపాల్‌లో చిక్కుకున్న లేదా విపత్తు ప్రభావానికి గురైన తెలంగాణ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా కేంద్ర ప్రభుత్వం, భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. గాయపడిన వారికి వైద్యం, మృతుల మృతదేహాలను స్వదేశానికి తరలించడం, గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఎంపీ డా.కడియం కావ్య విజ్ఞప్తి చేశారు.


# అంజయ్యనగర్‌లో కూల్చివేతలు...
# సీతాఫల్మండిలో ఎప్పుడు.?

**-సీతాఫల్మండిలో జోరుగా అక్రమ నిర్మాణాల దందా**
**-రెండంతస్తుల అనుమతులు.. ఆరంతస్తుల వరకు నిర్మాణాలు**
**-రెసిడెన్షియల్ పర్మిషన్లతో కమర్షియల్ అపార్ట్మెంట్ల దందా**
**-అక్రమ నిర్మాణాలను ప్రశ్నిస్తే బెదిరింపులు, దాడులు, అక్రమ కేసులు**
**-కోట్లకు పడగలెత్తుతున్న బిల్డర్లు.. మామూళ్ల మత్తులో టౌన్ ప్లానింగ్ అధికార యంత్రాంగం.?**
**-డిప్యూటీ, జోనల్ కమిషనర్లకు ఫిర్యాదులు చేసిన చర్యలు శూన్యం మామూళ్ల మాయేనా.?**

హైదరాబాద్,ఆగస్టు28 (నేటి దర్శిని): గ్రేటర్ హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలపై కూల్చివేతలు కొనసాగుతున్నా.. తార్నాక సర్కిల్ పరిధిలో సీతాఫల్మండి ప్రాంతంలో మాత్రం అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు ఎందుకు కొరడా ఝుళిపించడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఒకవైపు అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు చర్చనీయాంశంగా మారగా.. మరోవైపు సీతాఫల్మండిలో ఏళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికుల నుండి వెల్లువెత్తుతున్నాయి.

**రెండంతస్తుల అనుమతి.. ఆరంతస్తుల వరకు నిర్మాణాలు**

సీతాఫల్మండిలో చాలా నిర్మాణాలకు రెండు అంతస్తుల అనుమతులు తీసుకుని.. వాస్తవానికి అంతకుమించి దాదాపు 6 అంతస్తులు నిర్మిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రెసిడెన్షియల్ బిల్డింగ్‌కు అనుమతులు తీసుకుని రహదారిపైనే కమర్షియల్ నిర్మాణాలు చేయడం, అపార్ట్మెంట్లు నిర్మాణాలు చేసే అమ్మడం పై ఫిర్యాదులు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. నిర్మాణ అనుమతులు, వాస్తవ నిర్మాణాల మధ్య తేడాలపై స్టేట్ విజిలెన్స్ తో సమగ్ర తనిఖీలు జరిగితే బిల్డర్ల, టౌన్ ప్లానింగ్ అధికారుల అసలు బాగోతం బయటపడుతుందని స్థానికుల పేర్కొంటున్నారు. భవన నిర్మాణ అనుమతులు, వినియోగం, నిర్మాణ విస్తీర్ణం వంటి వివరాలు అధికారిక రికార్డుల్లో పరిశీలించాల్సిన అంశాలే. టిజి బిపాస్ లో కూడా భవన అనుమతి కేసుల్లో ప్రతిపాదిత వినియోగం, నిర్మాణ విస్తీర్ణం వంటి వివరాలు నమోదు అవుతున్నాయి. నిర్మాణాలను, అనుమతులు పరిశీలిస్తే ఇక్కడ బిల్డర్లు చేసే అవినీతి దందా ఎంత తీవ్రస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు ప్రభుత్వానికి సూచిస్తున్నారు.





బిల్డర్లుగా అవతారమెత్తిన దారినపోయే దానయ్యలు.?

మున్సిపల్ అనుమతులు లేకుండానే కొందరు బిల్డర్లుగా అవతారమెత్తి నాసిరకమైన సామాగ్రితో భారీ నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో అక్రమ నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.80 లక్షల నుంచి కోటి రూపాయలకు పైగా లాభాలు వస్తున్నాయన్న చర్చ స్థానికంగా సాగుతోంది. దీంతో అక్రమ నిర్మాణాల దందా చిన్న వ్యాపారం కాదు.. కోట్ల రూపాయల రియల్ ఎస్టేట్ దందాగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**అక్రమాలను ప్రశ్నిస్తే దాడులు, బెదిరింపులు, గుండాయిజం..**

నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను ప్రశ్నించిన స్థానికులు, నిర్మాణదారుల అసోసియేషన్ సభ్యులు బెదిరించడం, దాడులకు పాల్పడటం, అక్రమ కేసులతో వేధిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిజంగా ఇలాంటి ఘటనలు జరిగితే పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు నీతి, నిజాయితీగా సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ ఇక్కడ ఆర్థిక బలం ఉండడంతో సామాన్యులే బలవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి అధికారులు పూర్తిగా రాజకీయ ఆర్థిక బలం ఉన్న వారికే పూర్తి సహాయ సహకారాలు అందించి ఫిర్యాదుదారులకు అన్యాయం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**మాజీ కార్పొరేటర్లకు ఇన్నోవా కార్ల గుసగుసలు**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గత కొన్ని దశాబ్దాల నుండి సీతాఫలమండి, పద్మారావు నగర్, సికింద్రాబాద్, రాణిగంజ్ లలో
అక్రమ నిర్మాణాలకు కొందరు మాజీ, తాజా ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. కొందరు మాజీ కార్పొరేటర్లకు బిల్డర్లు ఇన్నోవా కార్లు బహుమతిగా ఇచ్చారన్న గుసగుసలు కూడా ప్రచారంలో ఉన్నాయి. అంటే ఇక్కడ బిల్డర్ల అక్రమ సంపాదన ఎంత తీవ్ర స్థాయిలో ఉందో అన్న ఆరోపణలు, గుసగుసల స్థాయిలోనే ఉన్నాయి. వీటిపై సంబంధిత సంస్థలు విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉంది.

**సీజ్ చేసిన భవనాలే మళ్లీ వినియోగంలోకి.?**

అత్యంత తీవ్రమైన ఆరోపణ ఏమిటంటే.. కోర్టులో స్టే ఆర్డర్లు, ఇతర కోర్టు కేసులు, గతంలో సీజ్ చేసిన భవనాలు నిర్మాణ పనులు పూర్తిచేసుకుని వినియోగంలోకి రావడం పై టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి ఎంత తీవ్ర స్థాయిలో ఉందో అన్న విమర్శలు ఉన్నాయి. ఒక్కొక్క అక్రమ నిర్మాణం నుండి అధికారులు లక్షలలో లంచాలు తీసుకున్నారని అందుకే వాటిని ప్రోత్సహించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీజ్ చేసిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నట్లు చూపించిన కొన్ని భవనాలు సైతం నిర్మాణం పూర్తి చేసుకుని ప్రస్తుతం వినియోగంలోకి వచ్చాయన్నది. నిజమైతే అధికారుల పర్యవేక్షణ, అవినీతిపై కూడా తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతుంది.

జీహెచ్ఎంసీ కమిషనర్ గతంలోనే అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఫిర్యాదులను నమోదు చేసి వాటిపై తీసుకున్న చర్యలను సమీక్షించాలని ఆదేశించిన విషయం ఉంది.

**మామూళ్ల మత్తులో అధికారులు.?**

సికింద్రాబాద్ జోన్ పరిధిలో ఉన్న సర్కిల్లో
టౌన్ ప్లానింగ్ సిబ్బంది నుంచి అధికారుల వరకు.. డిప్యూటీ కమిషనర్ల వరకు మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో నిజమెంత.? ఎవరి పాత్ర ఎంత.? అనే విషయాలను ఉన్నతాధికారులు స్టేట్ విజిలెన్స్, ఏసీబీ అధికారులచే విచారించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**సీతాఫల్మండికి కూల్చివేతల 'ముహూర్తం' ఎప్పుడు.?**

అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు కనిపిస్తున్న వేళ.. సీతాఫల్మండిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై ఎప్పుడు కూల్చివేతలు చేపడతారన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న. అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీకి ఫిర్యాదులు అందితే వాటిని కేవలం ఫైళ్లలోనే కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనుమతులకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.సీతాఫల్మండి అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి.. అనుమతులు, వాస్తవ నిర్మాణాలు, భవన వినియోగం, సీజ్ చేసిన తర్వాత పరిస్థితి, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదికను మున్సిపల్ కమిషనర్ బహిర్గతం చేస్తే అసలు బాగోతం బయటపడే అవకాశం ఉందని స్థానికులు కోరుతున్నారు.

# గూడెం వారింట రాఖీ పండుగ సందడి

**- ఎమ్మెల్యే జిఎంఆర్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపిన సోదరీమణులు**



పటాన్చెరు ఆగస్టు 28 (నేటి దర్శిని) .
సోదర సోదరీమణుల మధ్య ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కుటుంబంలో ఘనంగా జరిగాయి. రాఖీ పండుగను పురస్కరించుకొని శనివారం ఎమ్మెల్యే నివాసంలో కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి పండుగ సంబరాలు జరుపుకున్నారు.

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరీమణులు నర్సమ్మ, సువర్ణ ఆయనతో పాటు మరో సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే కుమార్తె కొలన్ రాజేశ్వరి రెడ్డి తన సోదరుడు గూడెం విక్రం రెడ్డికి రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటుకున్నారు.కీర్తిశేషులు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి కుమార్తె రుధిర, గూడెం విక్రం రెడ్డి కుమార్తె మహిరలు తమ సోదరులు అక్షయ్ రెడ్డి, నిహాన్ రెడ్డిలకు రాఖీలు కట్టారు. దీంతో గూడెం కుటుంబంలో రాఖీ పండుగ సందడి నెలకొంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. అక్కా చెల్లెళు , అన్నదమ్ముల మధ్య ప్రేమానురాగాలకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే గొప్ప పండుగ రాఖీ పౌర్ణమి అని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.79 కోట్ల 58 లక్షల రూపాయల అంచనా వ్యయం తో నాలల విస్తరణ పనులు

**-వరద ముంపు సమస్య నుండి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు**
**-నాలల విస్తరణ పనులతో లోతట్టు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం**
**-త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

రంగారెడ్డి జిల్లా ఆగస్ట్ 28 (నేటి దర్శిని): చందానగర్ డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య కాలనీ లో జరుతున్న పటేల్ చెరువు అలుగు నుండి గంగారం చెరువు వరకు నాల విస్తరణ పనులలో భాగంగా రూ.18 కోట్ల 92 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న ఆర్సీసీ బాక్స్ డ్రైన్ నిర్మాణం పనులను,ఆర్సీసీ బెడ్, సైడ్ వాల్స్ నిర్మాణం మరియు నాల విస్తరణ నిర్మాణం పనులను తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ గారు మరియు సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి ల తో కలిసి పరిశీలించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ాచీఞూ ఫేస్ 2 లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.79 కోట్ల 58 లక్షల రూపాయలతో అంచనా వ్యయం తో నాలల విస్తరణ పనులు చేపట్టడం తో ఎన్నో ఏండ్ల వరద ముంపు సమస్య కు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని, దానిలో భాగంగా రూ.18 కోట్ల 92 లక్షల రూపాయలతో పటేల్ చెరువు అలుగు నుండి గంగారం చెరువు వరకు నూతనంగా చేపట్టబోయే నాల విస్తరణ పనులను వేగంగా చేయాలని,పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని .ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తీరనుంది అని, నాలా విస్తరణ పనులకు అందరూ సహకరించాలని , ఒక్కప్పుడు వరదలు వస్తే కంటి మీద కునుకు లేకుండా ప్రజలు తీవ్ర ఆందోళన తో ఇబ్బందులకు గురయ్యేవారు అని, కానీ నేడు సమస్య లేకుండా మళ్ళీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగినది అని,నాలల విస్తరణ పనులతో లోతట్టు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం లభించింది అని ప్రజా అవసరాల దృష్ట్యా ప్రథమ ప్రాధాన్యత లో విస్తరణ పనులు చేపట్టాలని ,నాలల విస్తరణ పనులలో వేగం పెంచాలని ,యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలియచేశారు. నాలల విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, నాలల విస్తరణ పనులు సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని, ప్రధాన రహదారుల పై పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని , నాలల నిర్మాణం సమయంలో నీటి ప్రవాహం సాఫీగా సాగేలా లెవల్స్ ను నిర్ధారించుకొని పనులు చేపట్టాలని, వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడలని , వరద ముంపు మళ్ళీ పునరావృతం కాకుండా నాలల విస్తరణ నిర్మాణం పనులు చేపట్టాలని తెలియచేసారు.నాలల విస్తరణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని,నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని , పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని, నాల విస్తరణ పనులు పై అధికారులకు పలు సలహాలు ,సూచనలు ఇవ్వడం జరిగినది . ప్రతి వర్షానికి వరద నీరు కాలనీలు ముంచెత్తడం జరుగుతుంది అని, సమస్య శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపట్టడం జరుగుతుంది అని, భవిష్యత్తు లో వరద సమస్య మళ్ళీ పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకొని నాల విస్తరణ పనులు చేపడుతున్నాం అని, నాల విస్తరణ మరియు , ఆర్సీసీ బాక్స్ డ్రైన్ నిర్మాణము వలన ప్రజలకు ఎంతగానో ఉపశమనం కలుగుతుంది అని, ప్రజలకు సాంత్వన చేకూరుతుంది అని, పనులు పూర్తిచేయాలని అధికారులకు తెలియచేసారు.
పనుల విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడలని, వర్షకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజా అవసరాల దృష్ట్యా అసంపూర్తిగా మిగిలిపోయిన నాలా విస్తరణ నిర్మాణ పనులను చేపట్టడం జరిగినది అని, యుద్ధప్రాతిపదికన పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని,నాల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని,నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుడదని, పనుల లో వేగం పెంచాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడలని త్వరితగతిన నాల విస్తరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులకు తెలియచేసారు. నాలల విస్తరణ పై ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తప్పకుండా పరిష్కరిస్తామని, తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని ఏ చిన్న సమస్య ఎదురైన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని అధికారులకు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు మారబోయిన రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ , కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాంనుంతలలో సర్ కార్యక్రమం



ఆమనగల్లు, ఆగస్టు28 (నేటి దర్శిని): రాంనుంతల గ్రామపంచాయతీ పాత కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వడ్త్యావత్ శ్రీను నాయక్ అధ్యక్షతన, ఆమనగల్ మండల ఎమ్మార్వో ఫయీం ఖాద్రి సమక్షంలో ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ ఫారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఓటర్లకు సర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. డ్రాఫ్ట్ జాబితాలో పేర్లు ఉన్న ఓటర్లు తమకు అందించిన ఫారాలను పూర్తి చేసి, గుర్తింపు కార్డు జతచేసి ఆగస్టు 29లోపు సమర్పించాలని అధికారులు సూచించారు. ఓటర్లందరూ తమ వివరాలను పరిశీలించుకుని, అవసరమైన సవరణలు ఉంటే గడువులోగా ఫారాలను సమర్పించాలని కోరారు.

# కొండేటి శ్రీను కుటుంబాన్ని పరామర్శించిన జూలకంటి రంగారెడ్డి



నిడమనూరు ఆగస్టు 28 (నేటి దర్శిని): సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను తండ్రి కొండేటి చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో కొండేటి శ్రీను ని పరామర్శించి చందయ్య మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించి చిత్రపటానికి నివాళులు అర్పించిన మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ జూలకంటి రంగారెడ్డి పరామర్శించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మంగారెడ్డి సిపిఎం మండల కార్యదర్శి కందుకూరు కోటేష్, కొండేటి సైదయ్య, కొండేటి సామంత్ , నక్రేకంటి వెంకన్న, సుంకిశాల రాజు పాల్గొన్నారు




# దూసుకుపోతున్న ఇరుముడి

## గ్రామీణ ప్రాంతాల్లో భారీగా టిక్కెట్ల అమ్మకం




మాస్ మహారాజా రవితేజ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతూ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. విడుదలైనప్పటి నుంచి వరుసగా రికార్డులు సృష్టిస్తున్న ఈ చిత్రం తాజాగా ఆన్‌లైన్ టికెట్ విక్రయాల్లో సరికొత్త మైలురాయిని చేరుకుంది. ప్రముఖ టికెటింగ్ ఎ÷-లాట్‌ఫార్మ్‌లైన బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్స్ ద్వారానే 'ఇరుముడి'కి 55 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. ఒక ప్రాంతీయ చిత్రానికి ఈ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.రవితేజ మాస్ అప్పీల్, ఎమోషనల్ డ్రామా, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుండటంతో థియేటర్లలో ప్రేక్షకుల రద్దీ కొనసాగుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మాస్ ప్రేక్షకుల వరకు అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో సినిమా కలెక్షన్ల పరంగా కూడా దూసుకుపోతోంది. బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఇరుముడి' ఇప్పుడు టికెట్ విక్రయాల్లోనూ తన సత్తా చాటుతూ కొత్త రికార్డులను లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం చిత్రానికి ఉన్న జోరు చూస్తుంటే రాబోయే రోజుల్లో మరిన్ని మైలురాళ్లు అందుకోవడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# నేడు కింగ్ 100 టైటిల్ గ్లింప్స్ విడుదలకు సిద్ధం



టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆయన కెరీర్‌లో వందో మైలురాయిగా నిలుస్తున్న ప్రతిష్టాత్మక 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. యువ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఈ చిత్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. నాగార్జున పుట్టినరోజు కానుకగా ఆగస్టు 29 ఉదయం 9 గంటలకు 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఫాస్టెన్ యువర్ సీట్‌బెల్ట్స్ రేపటి నుంచి కింగ్ ఆధిపత్యం మొదలవ్వబోతోంది అంటూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పంచుకున్న ఈ అనౌన్స్‌మెంట్ ప్రస్తుతం అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

# మళ్లీ లవ్ బ్రేకప్

## -బాయ్‌ఫ్రెండ్ వాకర్ బ్లాంకోకి గుడ్ బై చెప్పిన అనన్య పాండే

బాలీవుడ్ యంగ్ బ్యూటీ అనన్య పాండే వ్యక్తిగత జీవితం మరోసారి బీ-టౌన్‌లో చర్చనీయాంశంగా మారింది. గత కొంతకాలంగా ప్రేమలో ఉన్నట్లు వార్తల్లో నిలిచిన ఆమె, తన ప్రియుడు వాకర్ బ్లాంకోతో విడిపోయినట్లు జాతీయ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దాదాపు రెండేళ్లుగా వీరి రిలేషన్ కొనసాగగా, తాజాగా ముగింపు పలికారనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే అనన్య పాండే లేదా వాకర్ బ్లాంకో ఈ బ్రేకప్ వార్తలపై ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ వ్యవహారంపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. కాగా, 2024 మధ్యలో జరిగిన అనంత్ అంబానీ-రాధికా మర్చంట్ వివాహ వేడుకల సందర్భంగా అనన్య పాండే, వాకర్ బ్లాంకో మధ్య పరిచయం ఏర్పడినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ పరిచయం క్రమంగా స్నేహంగా, ఆ తర్వాత ప్రేమగా మారిందని బీ-టౌన్ వర్గాల్లో ప్రచారం జరిగింది.వీరిద్దరూ కలిసి పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో కనిపించడం, సోషల్ మీడియాలో ఒకరికొకరు ప్రత్యేకంగా స్పందించడం వంటి అంశాలు వారి రిలేషన్‌షిప్‌పై మరింత చర్చకు దారితీశాయి. ముఖ్యంగా వాకర్ పేరుకు సంబంధించిన లాకెట్‌ను అనన్య ధరించినట్లు వచ్చిన వార్తలు కూడా అప్పట్లో వైరల్ అయ్యాయి.అయితే తమ ప్రేమ గురించి అనన్య, వాకర్ ఇద్దరూ ఎప్పుడూ బహిరంగంగా అధికారిక ప్రకటన చేయలేదు. ఇప్పుడు విడిపోయారనే వార్తలు రావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం ఇద్దరి మధ్య వచ్చిన కొన్ని విభేదాల కారణంగా ఈ బంధానికి ముగింపు పలికారనే ప్రచారం సాగుతోంది. అయితే ఎలాంటి పెద్ద గొడవలు లేకుండా, పరస్పర అంగీకారంతోనే స్నేహపూర్వకంగా వేర్వేరు మార్గాలను ఎంచుకున్నట్లు కూడా సినీ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ఈ వార్తలపై అధికారిక ధృవీకరణ లేనందున, ప్రస్తుతం ఇవన్నీ మీడియా వర్గాల్లో జరుగుతున్న ప్రచారంగానే పరిగణించాల్సి ఉంటుంది. వాకర్ బ్లాంకోకు ముందు అనన్య పాండే పేరు బాలీవుడ్ నటుడు ఆదిత్య రాయ్ కపూర్‌తోను బలంగా వినిపించిన సంగతి తెలిసిందే. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే వార్తలు చాలాకాలం బాలీవుడ్ మీడియాలో హల్‌చల్ చేశాయి. అనంతరం ఆ బంధానికి కూడా ముగింపు పలికారనే ప్రచారం జరిగింది. ఇప్పుడు వాకర్ బ్లాంకోతోనూ బ్రేకప్ వార్తలు రావడంతో అనన్య వ్యక్తిగత జీవితం మరోసారి వార్తల్లో నిలిచింది. రు.



# 18న వస్తోన్న అనుమాన పక్షి




డిజె టిల్లు'తో సెన్సేషనల్ డెబ్యూను అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ రెండో సినిమా 'అనుమాన పక్షి'. రాగ్ మయూర్ హీరోగా ఈ సినిమాను రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మించారు. తొలి చిత్రం తరహాలోనే ఈ సినిమానూ యునిక్ కామెడీ ఎంటర్ టైనర్ గా విమల్ కృష్ణ తెరకెక్కించారు.
తమ 'అనుమాన పక్షి' చిత్రం సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల తేదీని తెలియజేస్తూ ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమా విభిన్నమైన టోన్‌తో పాటు హీరో విచిత్రమైన ఆలోచనా విధానాన్ని ఈ పోస్టర్ ప్రజెంట్ చేస్తోంది. రాగ్ మయూర్ సంప్రదాయ దుస్తుల్లో చేతిలో రైఫిల్ పట్టుకుని కనిపిస్తున్నారు. ఆయన పక్కనే ఉన్న బ్లాక్‌బోర్డుపై 'డౌట్స్ అండర్ ఇన్వెస్టిగేషన్' అనే టైటిల్‌తో జీవితం, విధి, కర్మ, దేవుడి ఎ÷-లానింగ్స్ కు సంబంధించిన ఆసక్తికరమైన ప్రశ్నలను పొందుపరిచారు. 'ఒన్ బోయ్. బిలియన్ థాట్స్, జీరో చిల్' అనే ట్యాగ్‌లైన్ ఆయన పాత్రలోని ఆలోచనా విధానాన్ని మరింత ఆసక్తికరంగా తెలియజేస్తోంది.

# గొప్పవాళ్లంతా సింగిల్సే..

## -ప్రతి సక్సెస్‌ఫుల్ వ్యక్తి వెనుక మహిళ ఉండదు: ఆర్జీవీ సంచలన పోస్ట్



టాలీవుడ్‌లో కాంట్రవర్సీలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు రాంగోపాల్ వర్మ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. నిత్యం ఏదో ఒక అంశంపై తనదైన శైలిలో స్పందించే ఆర్జీవీ.. తాజాగా సింగిల్స్ గురించి చేసిన వ్యాఖ్యలు నెటిజన్ల మధ్య ఆసక్తికర చర్చకు దారితీశాయి. సాధారణంగా ప్రతి విజయవంతమైన పురుషుడి వెనుక ఒక మహిళ ఉంటుంది అనే మాటను తరచూ వింటుంటాం. అయితే ఈ మాటతో తాను ఏకీభవించనన్నట్లుగా ఆర్జీవీ తన ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. దేశంలో, ప్రపంచంలో గొప్ప విజయాలు సాధించిన అనేక మంది ప్రముఖులు సింగిల్స్‌గా ఉన్నారంటూ ఆసక్తికరమైన పేర్లను ప్రస్తావించారు.ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, టాటా, బాటా, ఏపీజే అబ్దుల్ కలాం, సల్మాన్ ఖాన్, రాహుల్, యోగి, బాబా రాందేవ్ వంటి ప్రముఖులను ఉదాహరణగా చెబుతూ.. ప్రతి సక్సెస్‌ఫుల్ పురుషుడి వెనుక మహిళ ఉండాల్సిన అవసరం లేదు. గొప్పవాళ్లు సింగిల్స్‌గా కూడా గొప్ప విజయాలు సాధించగలరు అనే అర్థంలో ఆర్జీవీ వ్యాఖ్యానించారు. ఆయన చేసిన ఈ పోస్ట్ క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొందరు ఆర్జీవీ అభిప్రాయంతో ఏకీభవిస్తుండగా, మరికొందరు మాత్రం ఆయన వ్యాఖ్యలను సరదాగా తీసుకుంటూ సెటైర్లు వేస్తున్నారు. "ఈ గొప్పవాళ్ల జాబితాలో మీరు ఎక్కడ ఉన్నారు?" అంటూ కొందరు నెటిజన్లు ఆర్జీవీని ఫన్నీగా ప్రశ్నిస్తున్నారు. ఇంకొందరు ఆయనపై తమదైన శైలిలో కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా.. ఎప్పటిలాగే ఆర్జీవీ చేసిన ఒక్క పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకే కారణమైంది. సింగిల్‌గా ఉండటం, వివాహం చేసుకోవడం వ్యక్తిగత ఎంపిక అని.. విజయానికి వాటితో సంబంధం లేదని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతుండగా, మరికొందరు మాత్రం "ప్రతి విజయానికి వెనుక కుటుంబం, స్నేహితులు, సహచరుల మద్దతు కూడా కీలకమే" అంటూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి తన వివాదాస్పద, విభిన్న ఆలోచనలతో మరోసారి నెటిజన్లను చర్చకు లాగిన రాంగోపాల్ వర్మ.. ఈసారి "సింగిల్సే గ్రేట్" అంటూ చేసిన కామెంట్లతో వార్తల్లో నిలిచారు.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365